ఈనాడు
అమరావతి
కృష్ణా
శుక్రవారం అక్టోబరు 4, 2024



జగమేలు తల్లికి కుంకుమార్చన



అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని తెస్తున్న సీపీ రాజశేఖరబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

త్రిపుర సుందరి.. త్రిలోక పావని..

- తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం
- వేలాదిగా తరలివచ్చి దర్శించుకున్న భక్తజనం
- దుర్గమ్మకు స్వర్ణ కిరీటం అందజేసిన భక్తుడు



దివ్య హారతికి నీరాజనం



వందే.. మంగళకారిణి...



కమనీయం... నగరోత్సవం



శ్రీచక్ర నవావరణార్చన..



జయజయహే మహిషాసురమర్దిని



ఈనాడు, ఈనాడు డిజిటల్ – అమరావతి, న్యూస్‌టుడే – ఇంద్రకీలాద్రి

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. తొలి రోజు ఉదయం 9 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతించారు. దుర్గమ్మ బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇచ్చింది. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే పూర్ణఫలం దక్కుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకూ 70 వేల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గమ్మకు ఓ అజ్ఞాత భక్తుడు రూ.2.50 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన బంగారు కిరీటం, ఆభరణాలను తొలిరోజు అందజేశారు. బాలా త్రిపుర సుందరీదేవిని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను కలెక్టర్ సృజన పర్యవేక్షించారు.



దారులన్నీ అమ్మవైపే...



దండాలు.. దండాలూ.. అమ్మోరు తల్లీ

దుర్గమ్మా శరణు..

నేడు గాయత్రీదేవి రూపం...

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనుంది.


దర్శన వేళలు
ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు



కోలాట వైభవం...



అమ్మకు నృత్య నీరాజనం..



ఇంద్రకీలాద్రి.. శోభాయమానం

ఆశలు పట్టాలెక్కాల.. పనులు పరుగులెట్టాల!

- విజయవాడ రైల్వేస్టేషన్‌లో సమస్యల కూత
- కుంటుపడిన ప్రగతి.. గత ప్రతిపాదనలు బుట్టదాఖలు

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే

దేశంలోనే ప్రధాన రైల్వేస్టేషన్లలో నాలుగో అతి పెద్ద రైల్వేస్టేషన్ అయిన విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పరంగా వెనకబడింది. పెరుగుతున్న ప్రయాణికులకు అనుగుణంగా ఇప్పటికే ప్లాట్‌ఫామ్‌లు పెంచాల్సి ఉన్నా ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. గత ఐదేళ్ల వైకాపా పాలనలో విజయవాడ డివిజన్ అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల సాధనలో వైకాపా ఎంపీలు పూర్తిగా విఫలమయ్యారు. గతంలో ఎంపీలతో రైల్వే జీఎం నిర్వహించిన సమావేశంలో వారు ఇచ్చిన ప్రతిపాదనలన్నీ బుట్ట దాఖలయ్యాయి. ప్రతి బడ్జెట్‌లోనూ డివిజన్‌కు మొండిచేయి చూపారు. తాజాగా శుక్రవారం ఎంపీలతో నిర్వహించే సమావేశంలోనైనా దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు, ప్రయాణికుల సంక్షేమ సంఘాలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి.

భద్రత.. పెంచాలండోయ్...

సమీకృత భద్రతా వ్యవస్థలో భాగంగా రైల్వేస్టేషన్ చుట్టూ ప్రహరీ నిర్మించడం, అత్యాధునిక భద్రతా వ్యవస్థలో భాగంగా స్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫామ్‌లలో అదనంగా మరో 150 వరకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. రైల్వే పార్సిల్ కార్యాలయంలో విమానాశ్రయం తరహాలో అత్యాధునిక స్కానర్లు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఎలాంటి తనిఖీలు లేకుండానే పార్సిల్‌లో వచ్చిన వస్తువులను నేరుగా రైళ్లలోకి ఎక్కిస్తున్నారు. గతంలో దేశంలోనే పలు ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనలను దృష్టిలో పెట్టుకొని రైల్వేస్టేషన్‌కు మూడంచెల భద్రతా వ్యవస్థలో భాగంగా సమీకృత భద్రతపై రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

ఆగిపోవద్దు... సాగిపోదాం..

★ ప్రస్తుతం విజయవాడ రైల్వేస్టేషన్‌లో 10 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నాయి. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా మరో ఐదు ప్లాట్‌ఫామ్‌లు పెంచాలని ఇక్కడి అధికారులు ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ప్లాట్‌ఫామ్‌ల సంఖ్య పెంచితే రైళ్లు ఔటర్‌లలో నిలిపే పరిస్థితి ఉండదు. ప్రస్తుతం రైళ్లు సకాలంలో విజయవాడకు చేరుతున్నా స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లు ఖాళీ లేక ఔటర్‌లలో ఎక్కువ సేపు ఆపేస్తున్నారు.





చొరవ చూపితే ఆదాయం...

✪ రూ.కోట్ల విలువైన రైల్వే స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. రాయనపాడు, సత్యనారాయణపురం, సింగ్‌నగర్‌లలో సుమారు 150 ఎకరాల వరకు రైల్వే స్థలాలు ఉన్నాయి. వీటిని వినియోగంలోకి తెస్తే రైల్వేకి ఆదాయం రావడంతో పాటు స్థలాలు ఆక్రమణలకు గురికావు.

ఒత్తిడి తగ్గించాలి...

★ రూ.150 కోట్ల వ్యయంతో పదేళ్ల కిందట నగర శివారులో శాటిలైట్ స్టేషన్లను నిర్మించినా ప్రస్తుతం వృథాగా ఉన్నాయి. గుణదల, రాయనపాడు, కృష్ణకెనాల్ జంక్షన్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెస్తే విజయవాడ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గి ఆయా రైల్వేస్టేషన్ల నుంచి ప్రయాణికులు నేరుగా నగరానికి చేరుకోవచ్చు.

మనసుపెడితే మరికొన్ని...

★ ప్రయాణికులకు తక్కువ ధరకే ఆహార పదార్థాలు లభించే జనాహార్ క్యాంటీన్లను విజయవాడ రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలలో ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం రెండు ప్లాట్‌ఫామ్‌లలో మాత్రమే ఉన్నాయి. జనతా ఖానా కూడా అన్ని క్యాంటీన్లు, స్టాళ్లల్లో ఏర్పాటు చేయాలి. ★ విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ లేదు. ప్రయాణికులకు అనారోగ్య పరిస్థితి తలెత్తితే సమీప ఆస్పత్రులకు వెళ్లే లోపు ప్రాణాలు పోతున్నాయి. ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ★ రైల్వే నిర్వహణ పనుల పేరుతో విజయవాడ మీదగా నడిచే రైళ్లను ఏడాదిగా రద్దు చేస్తూనే ఉన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలి.

మచిలీపట్నం ఎంపీ బాలశౌరి ప్రతిపాదనలు..



గుడివాడ, మచిలీపట్నం, విజయవాడ, భీమవరం, సవారీగుడెం, వీరవల్లి సెక్షన్లలో ఆర్వోబీల నిర్మాణం, ఎల్‌సీ నెంబరు 338లో ఆర్‌యూబీ నిర్మాణం, బందరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ, మోడల్ రైల్వేస్టేషన్‌గా మార్పు, గుడివాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి, మచిలీపట్నం నుంచి నేరుగా తిరుపతికి ప్రత్యేక రైలు, గుడివాడ కేజీఆర్ కళాశాల వద్ద మినీ అండర్ బైపాస్ నిర్మాణం, గుడివాడ రైల్వేస్టేషన్ తూర్పువైపు కొత్త బుకింగ్ కౌంటర్ల ఏర్పాటు, తరిగొప్పల రైల్వేస్టేషన్‌లో ఎలక్ట్రానిక్ వెండింగ్ మెషీన్ ఏర్పాటు, తరిగొప్పల రైల్వేస్టేషన్‌లో రైలు నెంబరు 17255/172556కు హాల్టు సౌకర్యం, ఎల్ నెంబరు 9, 12, 14, 16, 20, 27, 31, 32, 28, 44 వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణం, సర్కార్ ఎక్స్‌ప్రెస్ నాగపట్టణం వరకు పొడిగింపు, వడ్లమన్నాడు, వీరవల్లి రైల్వేస్టేషన్లలో రైళ్లకు హాల్టు.. తదితర అంశాలను జీఎం దృష్టికి తీసుకెళ్లనున్నారు.

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రతిపాదనలు..



విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి నిధులు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలో వరద ముంపునకు గురి కాకుండా వించిపేట, పాత రాజరాజేశ్వరిపేట, కబేళా, కేఎల్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్ల నిర్మాణం, ఎల్‌సీ 7 మధురానగర్ పప్పులమిల్లు వద్ద ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం, ఎల్‌సీ 316 విజయవాడ, గుణదల మధ్య ఆర్వోబీ నిర్మాణం, రాజరాజేశ్వరిపేట కిమీ 434/20-22 వద్ద ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణం, ప్రయాణికుల సౌకర్యార్థం కరోనా సమయంలో ఆపేసిన విజయవాడ, డోర్నకల్ రైలు పునరుద్ధరణ, మైలవరం, తిరువూరు, జగ్గయ్యపేట, నందిగామ ప్రజల సౌకర్యార్థం రాయపాడు రైల్వేస్టేషన్‌లో శాతవాహన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు సౌకర్యం, ఎల్‌సీ గేట్ 140 కొండపల్లి వద్ద ఆర్‌యూబీ, ఎల్‌సీ 147 వద్ద ఆర్వోబీ, ఎల్‌సీ 148 వద్ద ఆర్వోబీ, మచిలీపట్నం, యశ్వంత్‌పూర్ రైలును రోజూ నడపాలి. పూరి, తిరుపతి రైలుకు రామవరప్పాడులో హాల్టు, విజయవాడ రైల్వేస్టేషన్‌లో పార్సిల్ కార్యాలయం నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ప్రస్తుతం అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన రైల్వే రిజర్వేషన్, జనరల్ బుకింగ్ కౌంటర్లు తిరిగి ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పైకి మార్పు, జగ్గయ్యపేట, మైలవరం పరిధిలో పలు ప్రాంతాల్లో ఆర్‌యూబీ, ఆర్వోబీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలి.



అయిదేళ్ల పాపం.. అంతులేని శోకం!

ఈ చిత్రం పరిశీలించారా..? ఇదేదో సాగు నీటి చెరువు అనుకుంటే పొరపాటే..! అక్రమ మట్టి తవ్వకాలతో ఏర్పడిన చెరువులు..! ఇటీవల వర్షాలకు దాదాపు 10-15 మీటర్ల లోతులో నీరు నిలిచింది. విజయవాడ గ్రామీణం కొత్తూరు పరిధిలో ఒక వ్యక్తి ఈ గుంతల్లో పడి గురువారం గల్లంతయ్యారు. పోలీసులు, గజ ఈతగాళ్లు గాలించారు. ఇక స్థానికుల వల్ల కాలేదని ఎన్డీ ఆర్‌ఎఫ్ బృందాలను రప్పిస్తున్నారు. ఇలాంటి గుంతలు కొత్తూరు, తాడేపల్లి, వేమవరం, వెలగలేరు, గన్నవరం మండలంలోని పలు గ్రామాల్లో ఎక్కడ పడితే అక్కడ ఉన్నాయి. కొత్తూరులోనే కాదు.. నందిగామ, కంచికచర్ల మండలాల్లో క్వారీ గుంతల్లో పడి విద్యార్థులు బలయ్యారు.

మృత్యు కుహరాలుగా అక్రమ తవ్వకాల గుంతలు

భారీ తటాకాలుగా మారిన పచ్చిక బయళ్లు, పొలాలు



కొత్తూరు గ్రామ పరిధిలో అక్రమ మైనింగ్‌తో ఏర్పడిన చెరువులు

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో కృష్ణా నదిలో ఈతకు వెళ్లి గల్లంతైన వారి సంఖ్య.. దాదాపు 76 మంది వరకు ఉంది. గత అయిదేళ్లలో మృతి చెందిన వారి సంఖ్య. వీరిలో విద్యార్థులే ఎక్కువగా ఉన్నారు. కీసర, మున్నేరు నదుల్లోనూ ఈతకు వెళ్లి గల్లంతై విగత జీవులుగా లభించిన ఘటనలు ఉన్నాయి. దీనికి కారణం ఇసుకాసురుల అక్రమ తవ్వకాలు. విచ్చలవిడిగా తవ్విన గుంతలతో విద్యార్థులు, యువకులు, పశువులు మొపకం దారులు... గుంతల్లో పడి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. దీనిపై జాతీయ హరిత ట్రిబ్యునల్ సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టింది. దీనికి రక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన యంత్రాంగం వాటిని విస్మరించింది. ఇది కేవలం కృష్ణా, మున్నేరు నదులకే పరిమితం కాలేదు.

విచ్చలవిడి తవ్వకాల వల్లే..

గత అయిదేళ్లలో విచ్చలవిడిగా తవ్వకాలు జరిపిన అక్రమ క్వారీ గుంతలకు వ్యాపించింది. కొన్ని లక్షల ఘనపు మీటర్ల మట్టి ఇష్టాను సారం తరలించడంతో ఏర్పడిన తటాకాలు.. ఇప్పుడు మృత్యుకుహరాలుగా మారాయి. అక్రమ క్వారీయింగ్‌ను అరికట్టగలిగితే.. సారవంత నేలలు ఇలా తయారయ్యేవి కావని పశువులకు సైతం పచ్చిక లేని మైదానాలు తయారయ్యాయని గ్రామస్థులు వాపోతున్నారు. ఇటీవల కంచికచర్ల మండలంలో క్వారీ గుంతల్లో పడి ముగ్గురు యువకులు మరణించిన ఘటన మరిచిపోక ముందే ఇప్పుడు విజయవాడ గ్రామీణం కొత్తూరు పరిధిలో సంఘటన చోటు చేసుకుంది.

చర్యలు శూన్యం..!

విజయవాడ గ్రామీణం, జి.కొండూరు, గన్నవరం మండలాల్లో వందల ఎకరాల్లో మట్టి తవ్వకాలు జరిగినా.. అధికార యంత్రాంగం చోద్యం చూసింది. ఒక్కరిపైనా చర్య తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ బంజరులతోపాటు గ్రామ కంఠాలు.. పచ్చిక బయళ్లు అక్రమార్కులు చెరబట్టారు. వందల ఎకరాల్లో తవ్వకాలు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా రెండు తాటి చెట్ల లోతులో తవ్వారు. నిబంధనల ప్రకారం గనుల శాఖ ఆధ్వర్యంలో క్వారీలు నిర్వహిస్తే.. తవ్విన ప్రాంతాన్ని తిరిగి పూడ్చాలి. కంకర కానీ ఇతర గనులు గానీ తవ్వకాలు జరిపితే.. వాటిని పూడ్చేయాలి. జిల్లాలో కంకర మెటల్ తప్ప ఇతర గనులు లేవు. గ్రావెల్ మట్టి తవ్వకాలే ఎక్కువ. పొలాల్లో, మెట్టప్రాంతాల్లో తవ్వకాలు జరిపి వాటి అలా వదిలేశారు.

అసైన్డ్‌నూ వదల్లేదు..

అసైన్డ్ భూముల నుంచి సైతం లీజుకు తీసుకుని మట్టి తవ్వకాలు జరిపారు. ఎకరా ధర లీజుకు రూ.10-30 లక్షల వరకు తీసుకున్నారు. ఒక మీటరు లోతు తవ్వకాలకు ఒప్పందాలు చేసుకుని 10 మీటర్ల వరకు తవ్వకాలు జరిపి ఆ భూములు ఎందుకూ పనికిరాకుండా చేస్తున్నారు. ప్రస్తుతం అవి మృత్యుకుహరాలుగా మారాయి. పశువులు కూడా వీటిలో పడి చని పోతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ మూడు మండలాల్లో రూ.కోట్ల విలువైన అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం మారినా చర్యలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలోనూ, ఎన్జీటీలోనూ కేసు విచారణలో ఉంది. ఇలాంటి ప్రాంతాల్లో కనీసం రక్షణ చర్యలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఎన్జీటీకి ఇచ్చిన నివేదికలో అధికారులు మాత్రం తగు చర్యలు తీసుకుంటున్నామనీ.. హెచ్చరిక బోర్డులు పెడుతున్నామనీ.. ముళ్ల కంచెలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడా వాటి ఆచూకీ లేదు.

విజిలెన్సు విచారణ!

జిల్లాలో అక్రమ మైనింగ్‌పై విజిలెన్సు విచారణ ప్రారంభించింది. ప్రభుత్వం దీనిపై ఆదేశాలు ఇవ్వడంతో ఇతర జిల్లాల బృందాలు వచ్చి విచారణ చేపట్టాయి. బాపులపాడు మండలంలో నిర్వహించారు. విజయవాడ గ్రామీణం పాతపాడులో ఒక రోజు అక్రమ మైనింగ్ గుంతలను లెక్కలు తీశారు. ఇతర గ్రామాలకు పరిశీలన బృందాలు వచ్చి లెక్కలు తీయాల్సి ఉంది.

అభ్యంతరాల నడుమ మల్లవల్లి భూముల సర్వే



ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో వివరాల సేకరణ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలం మల్లవల్లిలో గురువారం రెవెన్యూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఆర్.ఎస్.నంబరులో ఉన్న భూముల విస్తీర్ణంపై గందరగోళం నెలకొనడం, వాస్తవ హక్కుదార్లకు దస్త్రాలు ప్రకారం క్షేత్రస్థాయిలో భూమి కన్పించకపోవడంతో ప్రతిష్టంభన నెలకొంది. ఈ క్రమంలో మూడు నెలల నుంచి వివాదం నడుస్తోంది. ఇప్పటికే పలుమార్లు సర్వే కూడా నిర్వహించారు. అయినా స్పష్టత రాకపోవడం, రైతుల అభ్యంతరాలు కొనసాగుతుండటంతో జిల్లా సర్వే అధికారి మనీషా త్రిపాఠి, గుడివాడ ఆర్డీవో సుబ్రమణ్యం, తహసీల్దార్ నాగమోహన్ పర్యవేక్షణలో ఇతర ప్రాంతాలకు చెందిన 10 మంది మండల సర్వేయర్లు, 40 మంది గ్రామ సర్వేయర్లు గురువారం సర్వే చేపట్టారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం సర్వే నిర్వహించడంపై రైతులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రికార్డులు టాంపరింగ్ జరిగాయని, వాటిని సరిదిద్దకుండా సర్వే చేస్తే తమకు అన్యాయం జరుగుతుందంటూ పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డులు, రైతుల దస్త్రాలు, గ్రామ యూనిట్‌గా మొత్తం మూడు విధాలుగా సర్వే చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆర్డీవో, తహసీల్దార్ స్పష్టం చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో పీవీపీ సిద్ధార్థ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రిన్సిపల్ కె.శివాజీబాబు, తదితరులు

కానూరు, న్యూస్‌టుడే: ప్రఖ్యాత బహుళజాతి సంస్థ యాక్సెంచర్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో పీవీపీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 212 మంది ఎంపికై ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రత్యేకంగా కోడింగ్, ఇతర నైపుణ్యాలలో శిక్షణ ఇవ్వడం వలన ఈ ఘనత సాధించగలిగారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రాంగణ ఉపాధి అధికారి రమేష్ తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులతోపాటు అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో క్రీడల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు సూచనలు చేశారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పంచాయతీలు, పురపాలక సంఘాలు, కార్పొరేషన్ నుంచి జీవో నెం.84 ప్రకారం రావాల్సిన 3 శాతం స్పోర్ట్స్ సెస్సు వసూలు చేయాలన్నారు. తక్షణం నిధులు సమకూర్చుకుని క్రీడల అభివృద్ధికి వెచ్చించాలని చెప్పారు. ఆయా క్రీడలకు సంబంధించి క్యాలెండర్ రూపొందించుకుని ఈవెంట్స్ నిర్వహించాలని సూచించారు. కమిటీ సభ్య కన్వీనర్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారిణి ఝాన్సీ, కమిషనర్ బాపిరాజు, పంచాయతీ అధికారి కార్యాలయ ఏవో సీతారామయ్య తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు ప్రాధాన్యం: మచిలీపట్నం నగర సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ బాలాజీ అధికారులకు సూచించారు. దీనిపై గురువారం ఛాంబర్‌లో ముడ, కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముడ పరిధికి సంబంధించిన రేఖాచిత్రాలను పరిశీలించారు. రహదారి డివైడర్లపై వివిధ కళాకృతులతో రంగులు వేయించేందుకు టెండర్లు పిలవాలని చెప్పారు. ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేసేలా చూడాలన్నారు. విజయవాడ తరహాలో ముఖ్య కూడళ్లలో వాహన వ్యర్థ పరికరాలు, ఇతర వస్తువులతో తయారు చేసిన కళాకృతులు ఏర్పాటు కావాలన్నారు. పర్యావరణ నివేదిక ప్రకారం డంపింగ్ యార్డులో నిల్వ ఉన్న లక్ష టన్నుల చెత్తను తొలగించేందుకు స్వర్ణాంధ్ర కార్పొరేషన్ ఎండీ, మున్సిపల్ పరిపాలన కమిషనర్లకు లేఖలు రాసి అనుమతులు పొందాలన్నారు. బందరు పోర్టు నుంచి రోజూ 25వేల క్యూబిక్ మీటర్ల వ్యర్థాలు వస్తున్నాయని, వాటిని వినియోగించి లోతట్టు ప్రాంతాలను మెరక చేసుకోవాలన్నారు. కమిషనర్ బాపిరాజు, ముడ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, ఈఈలు భూషణం, శ్రీకాంత్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

కొండలమ్మ ఆలయంలో శరన్నవరాత్రులు ప్రారంభం



బాలాత్రిపురసుందరీ దేవిగా కొండలమ్మ



అమ్మవారికి శేషవస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రాము

వేమవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం కొండలమ్మతల్లి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రులను గురువారం వైభవంగా ప్రారంభించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలదండలు, కొబ్బరి, మామిడి తోరణాలు, అరటిచెట్లతో సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సంప్రదాయబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలుకగా కలశస్థాపన, దీపారాధనతో ఉత్సవాలను ప్రారంభించారు. అధికారులు ఆయనకు శేషవస్త్రాలు, అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని సూచించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆయనకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, చిత్రపటం అందజేశారు. ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రుద్రపాక శివసంతోషశర్మ పర్యవేక్షణలో రుత్వికులు దీక్షాధారణ చేపట్టి నవగ్రహదోష పరిహారానికి లక్ష్మీగణపతి సహిత నవగ్రహ హవనములు నిర్వహించారు. అంగలూరు, చింతలమడ భక్తబృందంచే భజన, రాత్రికి మచిలీపట్నం విద్యార్థుల కూచిపూడి నృత్యం, రెడ్డిపాలెం వారి శ్రీమద్విరాట్‌పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించారు. ఆలయ మాజీ ఛైర్మన్ బెల్లంకొండ ఏడుకొండలు నటన అందరి ప్రశంసలందుకుంది. ఈవో ఆకుల కొండలరావు, జిల్లా పాల సమితి డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, చేకూరి జగన్మోహన్‌రావు, వెనిగండ్ల రామకృష్ణ, నియోజకవర్గ, మండల తెదేపా, జనసేన నాయకులు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్లను చిత్రపటంతో సత్కరిస్తున్న ఈవో కొండలరావు

పరిశ్రమలకు విరివిగా ప్రోత్సాహకాలు



రెడిమిక్స్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకరరావు, రోషన్‌కుమార్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపన వేగవంతం చేసి, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని గన్నవరం, దెందులూరు, చింతలపూడి ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్ పేర్కొన్నారు. బాపులపాడు మండలం వేలేరులో దాదాపు రూ.9కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన అధునాతన రెడిమిక్స్ ప్లాంటును గురువారం వీరు ప్రారంభించారు. నలుగురు యువకులు కలిసి టెక్నో ఇన్‌ఫ్రా పేరుతో నిర్మించిన ఈ పరిశ్రమ నిర్మాణ రంగంలో విప్లవాత్మక మార్పునకు నాంది పలుకుతుందన్నారు. తెదేపా నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి కల్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, అవిర్నేని భవానీశంకర్, యనమదల సుధాకర్, మొవ్వా వెంకటేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, కలపాల రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ బదిలీలపై నేతల ప్రభావం

అందరినీ మార్చాలన్న ఎమ్మెల్యే ★ కొందరికి స్థానిక నాయకుల వత్తాసు

న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

గన్నవరం నియోజకవర్గంలో రెవెన్యూ బదిలీలకు సంబంధించి ప్రతిష్టంభన ఎట్టకేలకు తొలగినా, బదిలీల జాబితా చూస్తే స్థానిక నేతల ప్రభావం బాగా పనిచేసినట్లుగా కన్పిస్తోంది. ముఖ్యంగా వీఆర్వోల విషయంలో ఇది స్పష్టంగా ఉంది. వాస్తవానికి 10 రోజుల కిందటే బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు మండలాలకు సంబంధించి భారీగా వీఆర్వోలకు స్థానం కల్పించారు. కాకుంటే వీరిలో ఎక్కువ మందిని ఒక మండలం నుంచి మరో మండలానికి, మరికొందరిని అదే మండలంలో కొనసాగిస్తూ వేరే గ్రామానికి బదిలీ చేశారు. కానీ వీరంతా గత ఐదేళ్లుగా ఇక్కడ పనిచేయడం, ఎక్కువ మంది మాజీ ఎమ్మెల్యే వంశీ, ఆయన ప్రధాన అనుచరులతో అంటకాగి, అక్రమాలకు సహకరించారనే ఫిర్యాదులు ఉండడంతో వీఆర్వోల మూకుమ్మడి బదిలీకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిర్ణయించారు. గత ప్రభుత్వం తాలుకా ఆనవాళ్లు, పరిచయాలు ఉండకూడదనే విధంగా ఆయన గట్టిగా నిర్ణయం తీసుకుని ఈ మేరకు కలెక్టర్‌కు సూచించినట్లు ప్రచారం జరిగింది. అందుకే గత నెల 26నే మూడు మండలాల్లో వీఆర్వోల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీయైనా వాటిని నిలిపివేశారు. నాయకుల సిఫార్సులతో చాలా మంది పాత స్థానాల్లోనే కొనసాగేలా, మరికొందరు పక్క మండలాలకు వెళ్లేలా తమకు అనుకూలంగా ఉత్తర్వులు పొందారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి వెళ్లడంతో బదిలీలు ఆపేసి, వీఆర్వోల జాబితాను పునఃపరిశీలించి, దాదాపుగా 60 మందిని మార్చాల్సిందిగా నిర్ణయం తీసుకున్నారని ప్రచారం జరిగింది. కానీ అప్పటికే జిల్లా వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ఇంతమందిని ఇప్పటికిప్పుడు మార్చడం కష్టం కావడంతో, వైకాపా ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా వ్యవహరించినట్లుగా ఆరోపణలున్న వారిని మార్చేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కసరత్తు ఎప్పుడో పూర్తి చేసినా, తిరిగి సిఫార్సుల కోసం వస్తారనే ఉద్దేశంతో బుధవారం రాత్రి ఎవరికి వారికే విడిగా బదిలీ ఉత్తర్వులు జారీ చేయించారు.

అయినా ఇక్కడే.. : ఎమ్మెల్యే స్పష్టంగా చెప్పినా బదిలీ జాబితా చూస్తే గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్న కొందరు ఇక్కడే కొనసాగేలా ఉత్తర్వులు తెచ్చుకోవడం గమనార్హం. బాపులపాడు మండలంలో డెల్టా పరిధిలో చేపల చెరువులు ఎక్కువగా ఉన్న గ్రామానికి వీఆర్వోగా ఉన్న వ్యక్తిని సాగనంపాలని ఎక్కువ మంది తెదేపా కార్యకర్తలు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో బుడమేరును ఆక్రమించి మరీ చెరువులు తవ్వుతున్నా ఈయన పట్టించుకోలేదని, వైకాపా నాయకులకు అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలున్నా ఈ బదిలీల్లో ఆయన స్థానం పదిలం చేసుకున్నారు. ★ డెల్టా పరిధిలోని మరో గ్రామ మహిళా వీఆర్వో పనితీరుపై ఎక్కువగా విమర్శలు వచ్చినా, కొందరు వ్యాపారుల ఒత్తిడి మేరకు ఆమెకు అక్కడే కొనసాగించే అవకాశం ఇచ్చారు. మరో మహిళా వీఆర్వోను తొలుత వేరే మండలానికి బదిలీ చేయగా, జనసేన నాయకుల సిఫార్సుతో తిరిగి అదే మండలంలో వీఆర్వోగా వచ్చారు. ★ వైకాపా హయాంలో విచ్చలవిడిగా తవ్వకాలు జరిగిన ఓ గ్రామానికి వీఆర్వోగా వ్యవహరించిన అధికారి తిరిగి అదే గ్రామంలో కొనసాగేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు.

ఇతర జిల్లాలకు..: గత ప్రభుత్వ హయాంలో ఏకపక్షంగా పనిచేశారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో బాపులపాడు మండలానికి చెందిన ఐదుగుర్ని ఎన్టీఆర్ జిల్లాకు, ముగ్గుర్ని ఏలూరు జిల్లాకు బదిలీ చేశారు. వీరికి ఇంకా ఎక్కడా పోస్టింగులు ఇవ్వలేదు. బాపులపాడు డీటీ, ఆర్ఐ పోస్టులకు సంబంధించి కూడా ఇంకా ప్రతిష్టంభన కొనసాగుతోంది.

బస్ స్టాండ్ మెరకకు రూ.9 కోట్లా ..!? : కొనకళ్ల

గుడివాడలో రెండు నూతన బస్సు సర్వీసులు ప్రారంభం



కొత్త బస్సుల వద్ద ఆర్టీసీ ఛైర్మన్ నారాయణరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని, అతని అనుచరులు ఆర్టీసీ బస్టాండు మెరక పనులకు రూ.9 కోట్లు ఖర్చు చేశారని, మెరక చేసి అభివృద్ధిని గాలికి వదిలేశారని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. కొడాలి నానికి నిధుల దోపిడీ తప్ప పట్టణాభివృద్ధిపై ధ్యాస లేదన్నారు. గతంలో తాను ఎంపీగా పనిచేస్తూ బస్టాండు అభివృద్ధికి అప్పటి మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావుతో కలిసి వచ్చానన్నారు. నాడు - నేడు గుడివాడ ఆర్టీసి బస్టాండు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని.. ఎమ్మెల్యే రాము సమక్షంలో త్వరలో అధునాతన బస్టాండు నిర్మిస్తామన్నారు. నిధుల విషయంలో గుడివాడకు ప్రథమ ప్రాధాన్యతిస్తానన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గత పాలకులు కమీషన్లకు కక్కుర్తిపడి బస్టాండు నిర్మించకుండా 9 కోట్లు బొక్కేశారన్నారు. లక్షలాది మంది ప్రజలకు అవసరమైన బస్టాండు వదిలి డిపో మెరక చేసి బస్టాండు అభివృద్ధి చేసినట్లు గొప్పలు చెప్పారన్నారు. చిన్న వర్షానికే ముంపు బారిన పడే ఈ బస్టాండు అభివృద్ధికి కొనకళ్లతో కలిసి ముందుకు వెళ్తామన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వాణిశ్రీ, విజయవాడ జోన్ ఆర్టీసీ ఈడీ గోపినాథ్‌రెడ్డి, డీఎం రాజేష్, భాజపా జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ తెదేపా అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, భాజపా పట్టణ అధ్యక్షుడు యర్రపోతు అర్జున్, తెదేపా నాయకులు పిన్నమనేని బాబ్జి, పోలాసి ఉమా, గుత్తా చంటి తదితరులు పాల్గొన్నారు.

15 వరకు ఇన్‌స్పైర్ ప్రాజెక్టుల నమోదు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 ఇన్‌స్పైర్ మనక్ ప్రాజెక్టుల నమోదుకు ఈనెల 15 వరకు అవకాశం ఉందని జిల్లా సైన్సు అధికారి జాకీర్ అహ్మద్ తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 1574 ప్రాజెక్టులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. గత ఏడాది 2023-24 విద్యా సంవత్సరంలో 1741 ప్రాజెక్టులు నమోదయ్యాయని తెలిపారు. వీరికి జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ ప్రదర్శన నవంబరు నెలలో నిర్వహిస్తామని వివరించారు. సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు ఈ ప్రాజెక్టుల నమోదుపై చొరవచూపాలని కోరారు.

నూతన ఇసుక రీచ్‌లు గుర్తించండి

కలెక్టరేట్ (మచిలీపట్నం): జిల్లాలో నూతన ఇసుక రీచ్‌లు గుర్తించాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. జేసీ గీతాంజలిశర్మతో కలిసి గురువారం కలెక్టరేట్‌లో మైనింగ్, రవాణా, పోలీస్, భూగర్భజల, పోర్టు అధికారులతో సమావేశం నిర్వహించి ఇసుక విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఇసుక నిల్వ చేసేందుకు ఎనిమిది స్టాక్‌యార్డులను గుర్తించామన్నారు. కొత్తగా గుర్తించే రీచ్‌ల్లో పట్టాభూములను సైతం పరిగణనలోకి తీసుకోవచ్చన్నారు. పోర్టు నిర్మాణం సీఎం ప్రాధాన్యతా అంశంగా ఉందని, ఆ పనుల కోసం ప్రత్యేక ఇసుక రీచ్‌ను కేటాయించాలని ఆదేశించారు. ఏఎస్పీ ప్రసాద్, మైనింగ్ ఏడీ కొండారెడ్డి, డీపీవో అరుణ, తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై..: ఈ నెల 5 నుంచి నగరంలో ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా చైతన్యపర్చాలని కలెక్టర్ బాలాజీ కార్పొరేషన్ అధికారులు, సిబ్బందికి సూచించారు. నగరంలో చెత్త నిర్వహణపై కార్పొరేషన్ సమావేశ మందిరంలో గురువారం అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. తాను వార్డులను ఆకస్మిక తనిఖీ చేస్తానని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్వచ్ఛ స్ఫూర్తిని కొనసాగించండి

కలెక్టరేట్ (మచిలీపట్నం): స్వచ్ఛభారత్ కార్యక్రమ అమల్లో రాష్ట్ర స్థాయిలో అవార్డులు దక్కించుకున్న మచిలీపట్నం కార్పొరేషన్ కమిషనర్, ఇతర సిబ్బందిని కలెక్టర్ బాలాజీ అభినందించారు. ప్రధాని నరేంద్రమోదీ 2014 అక్టోబరు 2న ప్రారంభించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో గత నెల 17 నుంచి ఈ నెల 2వ తేదీ వరకూ నిర్వహించిన స్వచ్ఛతాహీసేవ కార్యక్రమాల అమల్లో ప్రతిభచాటిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. మచిలీపట్నం నగరం సఫాయిమిత్ర సురక్షశివిర్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి అవార్డుకు ఎంపికైంది. దీన్ని పురస్కరించుకుని కమిషనర్ బాపిరాజు, స్వచ్ఛభారత్ ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావు, తదితరులను గురువారం కలెక్టర్ అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో నగరాన్ని స్వచ్ఛసుందరంగా తయారు చేయాలని సూచించారు. తాము అవార్డు దక్కించుకోవడంలో మార్గదర్శకులుగా ఉన్న కలెక్టర్‌ను కమిషనర్, సిబ్బంది ఘనంగా సత్కరించారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న కమిషనర్, కార్పొరేషన్ అధికారులు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, 135, 146 చికెన్ విత్ స్కిన్ - 246 చికెన్ స్కిన్‌లెస్ - 256.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

మచిలీపట్నం
•మచిలీపట్నం •పెడన

టౌన్ సర్వేయర్‌గా నాగరాజు

పెడన, న్యూస్‌టుడే: పెడన టౌన్ సర్వేయర్‌గా సీహెచ్.నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్‌లో డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తున్న ఆయన్ను పెడనలో నియమించారు. 1985లో పెడన పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా పెడన ఆవిర్భవించిన అనంతరం తొలిసారిగా టౌన్ సర్వేయర్ పోస్టును కూటమి ప్రభుత్వం భర్తీ చేసింది.

హౌసింగ్ ఏఈగా మాధవి: పెడన మండల హౌసింగ్ ఏఈ మాధవిని టౌన్ ఏఈగా నియమించారు. పట్టణంలో హౌసింగ్ పురోగతికి చర్యలు చేపడతానని ఏఈ చెప్పారు.

సబ్‌రిజిస్ట్రార్‌గా: పెడన సబ్‌రిజిస్ట్రార్‌గా ఎల్. వెంకటేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. మువ్వలో పనిచేస్తున్న ఆయన్ను సాధారణ బదిలీల్లో పెడన సబ్‌రిజిస్ట్రార్‌గా నియమించారు. రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడతామని ఈసందర్భంగా చెప్పారు.

కుల వివక్షపై రాజీలేని పోరాటాలు

మచిలీపట్నం (గొడుగుపేట): కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం అనేక రాజీలేని పోరాటాలు నిర్వహించిందని సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్ అన్నారు. నగరంలోని జ్యోతిరావుఫులే విజ్ఞాన కేంద్రంలో గురువారం సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు దాటినా ఎస్సీలపై కులవివక్ష, అవమానాలు, అంటరానితనం, దాడులు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు. వాటిని అడ్డుకునేందుకు సంఘం ఐక్య పోరాటాలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా సంఘ జిల్లా అధ్యక్షుడు కొడాలి శర్మ తదితరులు సంఘం జెండా ఆవిష్కరించారు. నాయకులు బుర్రె రాజు, రమేష్, బాబూరావు, సీఐటీయూ నాయకులు ఎం.పోలినాయుడు, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు యూనస్ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687



చెత్త, ఇతర వ్యర్థాలు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న కార్మికులు

✦ నగరంలోని జిల్లా ఎస్పీ కార్యాలయ ప్రాంతంలో రహదారి పక్కన వేసిన చెత్త, ఇతర వ్యర్థాలు తొలగించకపోవడంతో అక్కడకు పశువులు చేరుతున్నాయి. దీనివల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యను స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసురాగా ఈనాడులో వార్త ప్రచురించి అధికారులకు సమస్యను వివరించడంతో వెంటనే స్పందించి చెత్త తొలగించి శుభ్రం చేయించారు.

స్పందనకు వందనం

✦ నగరంలోని శివగంగ ప్రాంతంలో రహదారి పక్కన ఉన్న పైపులైన్‌కు లీకు ఏర్పడి తాగునీరు వృథాగా పోతోంది. దీంతో ఆ ప్రాంతానికి చెందిన వారు సమస్యను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసురాగా ఈనాడులో వార్త ప్రచురించి అధికారులకు సమస్యను వివరించడంతో వెంటనే స్పందించి మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో ఆ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



డంపింగ్‌యార్డులో జేసీబీ ద్వారా చెత్తను సరిచేస్తున్న దృశ్యం

✦ బందరు నగరంతో పాటు పెడన పట్టణంలోని డంపింగ్ యార్డుల వద్ద చెత్త రహదారులపైకి చొచ్చుకురావడంతో ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై సెప్టెంబరు 30న చెత్తకు చోటేది..పట్టించుకునేవారేరి శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు రెండు డంపింగ్ యార్డుల వద్ద రహదారులపైకి వచ్చిన చెత్తను తొలగించి యంత్రాలతో శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, మచిలీపట్నంకార్పొరేషన్

కేటుగాళ్ల వల!

ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని ఫేక్ కాల్స్

ఆందోళన చెందుతున్న వ్యాపారులు

జిల్లా బందరు మండలం పోతేపల్లికి చెందిన ఓ దుకాణదారుకి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి మచిలీపట్నం నగరపాలక సంస్థ నుంచి మాట్లాడుతున్నాం. మీరు నిర్వహించే దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని, వెంటనే రూ.5వేలు ఫోన్‌పే చేయాలని, లేదంటే అంతకంటే ఎక్కువ చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. మాది నగరపాలక సంస్థ పరిధిలోకి రాదు. బందరు మండలమని చెప్పినా ఐనకూడా పదిసార్లు ఫోన్ చేయడంతో నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లి ఆరా తీస్తే ఫేక్ అని తేలింది.

తాజాగా మరో వ్యక్తి నగరంలోని పలువురు దుకాణదారులకు ఫోన్ చేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలని వేధించడంతో నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్



కోనేరుసెంటరులోని దుకాణ సముదాయం

నగరంలో ఎవరు ఎలాంటి వ్యాపారం చేస్తున్నా వ్యాపార స్థాయిని బట్టి నగరపాలక సంస్థకు ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలి. చిన్నపాటి దుకాణదారు దగ్గర నుంచి సూపర్ మార్కెట్లు, మాల్స్ ఇలా అన్నీ నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. అలా రూ.300 నుంచి రూ.10వేలకు పైగా వ్యాపారాన్ని బట్టి రుసుము చెల్లిస్తుంటారు. వీటిని ఏటా ఫిబ్రవరిలో వసూలు చేస్తారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, క్షేత్రస్థాయిలో సిబ్బంది పట్టించుకోకపోవడంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. నగరంలోని 2,300 దుకాణాల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. నగరంలో అంతకంటే ఎక్కువ దుకాణాలు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని కొంత మంది అక్రమార్కులు వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు.

పక్కదారి పడుతున్న ప్రజాధనం

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సక్రమంగా వసూలు చేయకపోవడంతో కొంత మంది అక్రమార్కులు వ్యాపారులను బెదిరించి నగరపాలక సంస్థకు రావాల్సిన ఆదాయాన్ని కాజేస్తున్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది తమ ప్రాంతాల్లో పర్యటించి ఎక్కడెక్కడ ఎలాంటి దుకాణాలు కొత్తగా ఏర్పాటయ్యాయి. వాటికి ట్రేడ్ లైసెన్స్ తీసుకున్నారా లేదా అని ఆరా తీయడంతో పాటు లైసెన్స్ లేకపోతే దుకాణదారులకు వివరంగా చెప్పి నిర్దేశిత రుసుము వసూలు చేయాలి. గతంలో ఉన్నవాటిని వసూలు చేయడం తప్ప కొత్తగా ఏర్పాటు చేసినవాటి గురించి పట్టించుకోవడం లేదు. ఇది అక్రమార్కులకు అవకాశంగా మారింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు ట్రేడ్ లైసెన్సుల పేరిట వస్తున్న ఫేక్‌కాల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, వాటికి అడ్డుకట్ట వేసేలా చర్యలు తీసుకోవాలి. దీంతో పాటు లైసెన్సు ఫీజులు సక్రమంగా వసూలు చేసేలా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది.

ఎవరినీ నమ్మి మోసపోవద్దు



ట్రేడ్ లైసెన్స్ రుసుం నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి చెల్లించాలి. కొందరు వ్యాపారులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేసినట్టు మా దృష్టికి వచ్చింది. ఆ ఫోన్ నంబరుతో పాటు అన్ని వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. ప్రజలు ఎవరినీ నమ్మి మోసపోవద్దు. దీనిపై క్షేత్రస్థాయి సిబ్బందికి కూడా ఆదేశాలు జారీ చేశాం. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు అడిగితే వెంటనే సచివాలయంలో తెలియజేయడంతో పాటు పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలి.

- బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

కొనకళ్ల ప్రమాణ స్వీకారం నేడు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ఆర్టీసీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ కోరారు. విజయవాడలోని ఏపీఎస్‌ఆర్టీసీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సాయంత్రం 5గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అభినందన సభ జరుగుతుందన్నారు.

ఉత్సవ కమిటీలో పలువురికి చోటు



వెంకట్రావు



బాబాప్రసాద్



వేణు

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు: విజయవాడ కనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవ కమిటీలో మచిలీపట్నం, గూడూరు మండలానికి చెందిన పలువురు కూటమి నాయకులకు చోటు లభించింది. మచిలీపట్నంకు చెందిన తెదేపా నాయకులు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జనసేన నాయకులు, మాజీ కౌన్సిలర్ కొట్టే వెంకట్రావుతో పాటు గూడూరు మండలం తుమ్మలపాలెం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు తోట వేణులకు చోటు దక్కింది. కమిటీలో వీరు సభ్యులుగా నియమితులు కావడంపై పలువురు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.

దాడి ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా శక్తిపటాల ఏర్పాటు విషయంలో నెలకొన్న దాడి ఘటనలో బలరాముని పేటకు చెందిన త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి దాటాక శక్తిపట పందిరి వద్ద డీజేల సౌండ్ ఎక్కువగా ఉండడంతో ప్రశ్నించేందుకు వెళ్లిన త్రినాథ్‌కు అదే ప్రాంతానికి చెందిన సాయి, శివ తదితరుల మధ్య వివాదం రాజుకుంది. దీంతో సాయి, మరికొందరు అతని మిత్రబృందం కలిసి త్రినాథ్‌పై దాడి చేయడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు విజయవాడ తీసుకెళ్లారు. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసిన ఆర్‌పేట పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. తన కుమారుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి తల్లి బడుగు అరుణకుమారి, కుటుంబ సభ్యులు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు సమర్పించారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనలో భాగంగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో అవసరం మేరకు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పదోన్నతులు కల్పించాలని, అర్హులైన వారిని పట్టణ ఎంఈవోలుగా నియమించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, జె.లెనిన్ బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు పీఎఫ్ సమస్యలు పరిష్కరించి త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. సంఘం నగర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రాజాశ్రీధర్, టి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించకుంటే నిర్దేశించిన కార్యాచరణ మేరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడితే ఏదైనా సాధించవచ్చు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బసవేశ్వరరావు తదితరులు



నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థినులు

కృష్ణావిశ్వవిద్యాలయం (మచిలీపట్నం): విద్యార్థులు కష్టపడితే ఏదైనా సాధించవచ్చని కృష్ణా విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి రెక్టార్ ఎం.బసవేశ్వరరావు అన్నారు. విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల మధ్య సన్నిహిత సంబంధాలు పెంపొందడానికి, స్నేహపూర్వకంగా మెలగడానికి దోహదపడతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఆర్.విజయకుమారి మాట్లాడుతూ ఉత్తమ వ్యక్తిత్వం, మంచి నడవడిక, ఆలోచనాధోరణిని పెంపొందించుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటుకున్న విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డీన్ సుందరకృష్ణ, ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ఉష తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు విజిలెన్స్ అధికారుల తనిఖీ

పెడన గ్రామీణం: మండల ఎస్సీపల్లె శివారు దిరశవల్లి గ్రామంలో అక్రమ విద్యుత్తు వినియోగంపై వచ్చిన ఫిర్యాదులపై విజయవాడ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. రొయ్యలు, చేపల చెరువుల మీద ఉన్న కనెక్షన్లు, ఇళ్ల కనెక్షన్లు పరిశీలించారు. స్థానిక విద్యుత్తు శాఖాధికారులకు సమాచారం లేకుండా నేరుగా గ్రామానికి వెళ్లి తనిఖీ చేశారు. ఎక్కడా ఎటువంటి అవకతవకలు వెలుగుచూడలేదని మండల విద్యుత్తు ఏఈ ఏడుకొండలు తెలిపారు.

పెడనలో రెండు చోట్ల పికెట్లు

పెడన, న్యూస్‌టుడే: పెడనలో రెండు చోట్ల పోలీసు పికెట్లు కొనసాగుతున్నాయి. స్థానిక 6వ వార్డులో విగ్రహ ఏర్పాటుపై రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదం నేపథ్యంలో హైకోర్టు స్టాటస్‌కో ఉత్తర్వులనిచ్చింది. ఈఉత్తర్వుల అమలుకు అక్కడ పికెట్ ఏర్పాటు చేశారు. స్థానిక బస్టాండు సెంటరులో ఈనెల 15న రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు ఘర్షణకు దారితీసిన నేపథ్యంలో అక్కడ కూడా మరో పికెట్ ఏర్పాటు చేశారు. చెన్నూరు, పుల్లపాడుల్లో గతంలో ఏర్పాటు చేసిన పికెట్లను అధికారులు ఉపసంహరించారు.

వెండి కుందుల బహూకరణ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని బలరాముని పేట షిరిడీ సాయిబాబాకు దీపారాధన కార్యక్రమాల నిమిత్తం కాకినాడకు చెందిన కోకా కూర్మేశ్వరరావు, శైలజ దంపతులు రూ.50 వేల విలువగల వెండి కుందులు బహూకరించారు. వాటిని గురువారం ఆలయ ధర్మకర్త పిల్లారిశెట్టి శ్రీనివాసరావుకు అందించారు.

దసరా ఉత్సవాల్లో పకడ్బందీగా పారిశుద్ధ్యం

పెడన, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్న నేపథ్యంలో పారిశుద్ధ్యాన్ని విస్తృతంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు ఆదేశించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో గురువారం శానిటరీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ ఎండీ.ఖాజా, కౌన్సిలర్ కటకం ప్రసాద్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపీకిషోర్ పాల్గొన్నారు.

శక్తి స్వరూపిణి.. సకల శుభకారిణి



కృత్తివెన్ను: లలితా త్రిపుర సుందరీదేవిగా..



బంటుమిల్లి కనకదుర్గమ్మ ఆలయంలో..



పెదతుమ్మిడి శివాలయంలో రజత కవచాలంకృత పార్వతిదేవిగా..



పెడన: వాసవీ కన్యకా పరమేశ్వరీ అలంకారం



ఎస్.ఎన్.గొల్లపాలెంలో ఉమాదేవి అమ్మవారు



సుల్తానగరంలో దుర్గాభవానీ అలంకరణలో..



చిట్టిపాలెంలో..

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, మచిలీపట్నంరూరల్, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, న్యూస్‌టుడే: మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని ఆయా దేవాలయాల్లో గురువారం నుంచి దసరా నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో పాలకవర్గ ప్రతినిధులు మోటమర్రి బాబాప్రసాద్, మామిడి మురళీకృష్ణ తదితరులతో పాటు పలువురు ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆదిలక్ష్మి, పార్వతీదేవి బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు బందరుకోటలోని కోదండరామాలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి ఉత్సవాలు ప్రారంభించారు. ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు హిందూకళాశాల ప్రాంతంలో అమ్మవారికి దర్శించుకుని పూజలు చేశారు. ✦ మచిలీపట్నం మండలం ఎస్.ఎన్.గొల్లపాలెం, సుల్తానగరం, పోతేపల్లి, చిట్టిపాలెం గ్రామాల్లో శ్రీలలితా త్రిపుర సందరిదేవిగా అమ్మవారు భక్తులకు తొలిరోజు దర్శనమిచ్చారు. ✦ పెడన పట్టణం గూడూరు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో తొలిరోజు కన్యకా పరమేశ్వరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



పోతేపల్లి విజయకనకదుర్గ అమ్మవారు..



బందరుకోటలో పూజలు చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర దంపతులు



హిందూ కళాశాల వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు



బందరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో ..



మాట్లం శ్రీవిజయకనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వేదవ్యాస్

‘సనాతన ధర్మాన్ని అపవిత్రం చేయలేరు’

మాట్లం(కృత్తివెన్ను),న్యూస్‌టుడే: హిందూ సనాతన ధర్మం ప్రపంచంలోనే అతిశక్తిమంతమైందని, దానిని ఎవరూ అపవిత్రం చేయలేరని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దీక్షకు మద్దతుగా గురువారం మాట్లం గ్రామ పంచాయతీలోని శ్రీవిజయకనకదుర్గమ్మ ఆలయంలోని మెట్లను శుభ్రం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

టెట్ పరీక్షలు ప్రారంభం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండల నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం టెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 190 మందికిగాను 152 మంది, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరిగిన పరీక్షలో 190 మందికి 161 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రం అడ్మిన్‌గా పి.అశోక్‌కుమార్ వ్యవహరించారు.



పెడన: వీరమల్లు రెడ్డియ్యను సత్కరిస్తున్న ఎంపీడీవో కార్యాలయ, సచివాలయ సిబ్బంది

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ జయరామ్

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండల ఎంపీడీవో వీరమల్లు రెడ్డియ్య గురువారం రిలీవ్ అయ్యారు. ఆయన భీమవరం సమీప పాలకోడేరు మండలానికి బదిలీ అయ్యారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్డీ జయరామ్‌కు బాధ్యతలు అప్పగించారు. మండలంలో సచివాలయ ఉద్యోగులు బదిలీ అయ్యి రిలీవ్ అయ్యారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

గరిశపూడి (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: పెదలంక డ్రెయిన్‌లో బుధవారం కాలుజారి గల్లంతైన యువకుడు దాసరి భరత్ (17) ఆచూకీ గురువారం ఉదయం 9గంటలకు లభ్యమైందని ఎస్సై ఎ.పైడిబాబు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ మృతుడి బంధువులను పరామర్శించారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తి మృతి

మచిలీపట్నం క్రైం: స్థానిక జిల్లా పరిషత్ సెంటరులో గురువారం చోటుచేసుకున్న రహదారి ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కృత్తివెన్ను మండలానికి చెందిన నాగసూర్యకిరణ్‌కుమార్(31) బైక్‌పై మచిలీపట్నం వస్తుండగా జడ్పీ సెంటరు సమీపంలో ఫిట్స్‌లాగా రావడంతో కింద పడిపోయాడు. రోడ్డు దెబ్బ బలంగా తగలడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఊరూరా గ్రామసభలు

రుద్రవరం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: ఉపాధి పథకంలో చేపట్టాల్సిన పనులపై చర్చించేందుకు రుద్రవరం పంచాయతీలో గురువారం గ్రామసభ నిర్వహించారు. పనులను పంచాయతీ కార్యదర్శి బత్తిన అజయ్‌కుమార్ వివరించారు. గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్లు, జమాఖర్చులపై చర్చించారు. కార్యక్రమంలో తెదేపా గ్రామ అధ్యక్షుడు నీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుల్తానగరంలో: సుల్తానగరంలో పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. పంట కాలువల్లో పూడిక తీయించాలని, గత ఐదేళ్లుగా వైకాపా ప్రభుత్వం పూడిక తీయించలేదని గ్రామ తెదేపా అధ్యక్షుడు చిట్టిబొమ్మ వనరాజు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన సభలో వేముల శివాజీ, ఈడే దాసు, ఒడుపు నాగేశ్వరరావు, చిట్టిబొమ్మ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పెడన గ్రామీణం: మండలంలో పలు గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. నందిగామ, అచ్చయ్యవారిపాలెం బల్లిపర్రు, చెన్నూరు, చేవెంద్ర, చోడవరం, గురివిందగుంట, జింజేరు తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. నందిగామ గ్రామ సభలో ఈవోపీఆర్డీ జయరామ్, గ్రామ సర్పంచి బొడ్డు హరిబాబు పాల్గొన్నారు.



తొలి రోజు పూజ చేస్తున్న ఎస్పీ

పోలీసు కార్యాలయంలో నవరాత్రి ఉత్సవాలు

మచిలీపట్నం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పూజా కార్యక్రమాన్ని ఏఆర్ ఏఎస్పీ ఎస్‌వీడీ ప్రసాద్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది సమక్షంలో ఎస్పీ ఆర్.గంగాధరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా నవరాత్రులు ప్రతీకగా నిలుస్తాయన్నారు. హిందూ సంప్రదాయంలో నవరాత్రి వేడుకలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

సమగ్రశిక్షా ఉద్యోగుల వేతనాలు విడుదల చేయాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: సమగ్రశిక్షా ఉద్యోగుల వేతనాలు త్వరితగతిన విడుదల చేయాలని ఆర్ట్, వర్క్, హెల్త్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్‌ఎన్ దేవేంద్రరావు కోరారు. ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు ఇంతవరకు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులను అడిగితే ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయాల్సి ఉందని అంటున్నారని, త్వరలో దసరా పండగ వస్తున్నందున ఆ లోపే రెండు నెలల వేతనాలు విడుదల చేయాలని, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.



? పామర్రు పట్టణంలో శివాలయం ముందు బజారు పూర్తిగా గోతులు పడి పాడైంది. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.
- పీబీ శ్రీనివాస్

? స్థానిక గఫార్ సెంటరులోని మాంసం మార్కెట్ సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది.
- సుబ్బారావు

✔ రహదారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. చెత్త తొలగించి సంపద కేంద్రానికి తరలిస్తాం.
- సలీమ్, పంచాయతీ కార్యదర్శి, పామర్రు

? పామర్రు మండలం అడ్డాడ బీసీ, ఎస్టీ కాలనీల్లో డ్రెయినేజీ కాలువలు లేక మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. దుర్వాసనతోపాటు దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- శ్రీనివాస్, అడ్డాడ

✔ పంచాయతీలో నిధుల లభ్యతబట్టి డ్రెయినేజీలు తవ్విస్తాం.
- పామర్తి త్రినేత్రి, సర్పంచి
- న్యూస్‌టుడే, పామర్రు, పామర్రు గ్రామీణం

ఉత్సవ కమిటీ సభ్యురాలిగా పాప



అవనిగడ్డ, న్యూస్‌టుడే: విజయవాడ కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల కమిటీ సభ్యురాలిగా స్థానిక 2వ వార్డుకు చెందిన తెదేపా నాయకురాలు విశ్వనాథపల్లి పాపను నియమించారు. గతంలో ఆమె దుర్గ గుడి పాలకమండలి సభ్యురాలిగా పనిచేశారు.

వేణుగోపాలస్వామి ఆలయ ఛైర్మన్‌గా వల్లభనేని

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక పురాతన రుక్మిణీసత్యభామాసమేత వేణుగోపాలస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా, కమిటీ ఛైర్మన్‌గా వల్లభనేని సీతారాంను నియమిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీచేశారు. సీతారాం శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ట్రస్టీ ఛైర్మన్ వల్లభనేని వెంకట్రావ్ మృతి చెందడంతో ఆయన సోదరుడి కుమారుడు సీతారాం ట్రస్టీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

వీహెచ్‌పీ గ్రామ కమిటీ ఎన్నిక

కోడూరు (అవనిగడ్డ): కోడూరులో గురువారం విశ్వహిందూ పరిషత్ ఆత్మీయ సమావేశం అవనిగడ్డ ప్రఖండ ఉపాధ్యక్షుడు పూతబోయిన వెంకట సుబ్రహ్మణ్యం, కోడూరు ఖండ అధ్యక్షులు కోట సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధుబాబు, ఉపాధ్యక్షుడిగా పాలంకి రమాదేవి, కార్యదర్శిగా పూలబోయిన లంకేశ్వరరావు, సహాయ కార్యదర్శి, కోశాధికారితో పాటు మెంబర్లుగా మరో నలుగురిని ఎన్నుకున్నారు.

చెత్త పన్ను రద్దుతో హర్షాతిరేకాలు

ఆర్థిక భారం నుంచి గుడివాడ పట్టణవాసులకు ఉపశమనం

న్యూస్‌టుడే, గుడివాడ పట్టణం

చెత్త పన్ను.. గత వైకాపా ప్రభుత్వం విధించిన ఈ పన్నుతో పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడింది. ప్రజల కష్టాలను గుర్తించిన తెదేపా, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గాంధీ జయంతి కానుకగా కూటమి సర్కారు చెత్త పన్ను రద్దు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా పాలనలో ఏవీధిలో చూసినా చెత్త గుట్టలుగా పేరుకుపోయి ఉండేది. అయినప్పటికీ ఇంటింటికీ తిరిగి పన్ను మాత్రం వసూలు చేసేవారు. పన్ను చెల్లించేవరకూ వాలంటీర్లు, మరో వైపు సచివాలయ సిబ్బంది ప్రజల్ని నిద్రపోనివ్వలేదు. పన్ను కట్టని దుకాణాల వద్ద పారిశుద్ధ్య సిబ్బంది చెత్త కుప్పలు పోశారు. ఈ విధంగా గుడివాడ పురపాలక సంఘంలో ఎంతో మంది వ్యాపారుల్ని ఇబ్బందులకు గురిచేశారు.

ప్రజలకు నెలకు రూ.16 లక్షల లబ్ధి

గుడివాడ పురపాలక సంఘంలో డాబా ఇల్లుకు రూ.90, పెంకుటిల్లు, తాటాకు ఇళ్లకు రూ.30, అపార్టుమెంట్లకు రూ.120 చొప్పున పన్ను వసూలు చేశారు. ఈ విధంగా ప్రతి నెలా పట్టణంలోని 32 చెత్త తరలించే వాహనాలకు ఒక్కోదానికి రూ.50 వేలు చొప్పున లక్ష్యాలు విధించి రూ.16 లక్షలు వసూలు చేశారు. చాలా మంది పేదలు, మధ్య తరగతి కుటుంబాలు దీనిపై అప్పటి ఎమ్మెల్యే కొడాలి నానిని ఎన్నికల ప్రచారంలో నిలదీశారు.

మాట తప్పని చంద్రబాబు



ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారు. అందులో భాగంగానే చెత్త పన్ను కూడా వెంటనే రద్దు చేయడం ఆనందంగా ఉంది. చెత్త పన్ను కోసం వైకాపా హయాంలో సచివాలయం సిబ్బంది నిత్యం ఇళ్లకు వచ్చేవారు.
- షేక్ మౌలాలీ

చెత్త ఎత్తకుండా పన్ను వసూలు



పట్టణంలో పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడ పడితే అక్కడ వదిలేశారు. ఇంటింటికీ చెత్త సేకరణకు రాకున్నా పన్ను మాత్రం ప్రతి నెలా చెల్లించాలని వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఉదయాన్నే ఇంటికి వచ్చే వారు.
- నీలిశెట్టి నాగ సుందరి

పేదలు ఇబ్బంది పడ్డారు



ఇన్నేళ్లుగా చూస్తున్నాం. ఏ ప్రభుత్వం కూడా చెత్తకు పన్ను వేయలేదు. గత వైకాపా ప్రభుత్వం ఎందుకు అలా ఆలోచించిందో నేటికీ అర్థం కావడం లేదు. పేద, సామాన్య వర్గాలు ఇబ్బందులు పడ్డారు.
- పి.సుగుణ

ద్వారకా తిరుమలకు ఆర్టీసీ సర్వీసు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఈ నెల 4 నుంచి అవనిగడ్డ ఆర్టీసీ బస్ డిపో నుంచి ద్వారకా తిరుమలకు బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. బస్సు ఉదయం 5.30 గంటలకు బయలుదేరి గుడివాడ, హనుమాన్‌జంక్షన్, ఏలూరు మీదుగా ద్వారకా తిరుమలకు ఉదయం 9.10 గంటలకు చేరుతుంది. తిరిగి ఉదయం 10.30 గంటలకు బయలుదేరి అదే రూట్‌లో అవనిగడ్డ చేరుతుంది.

హైదరాబాద్ నుంచి..: దసరా సందర్భంగా హైదరాబాద్ నుంచి అవనిగడ్డకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ చెప్పారు. 3వ తేదీ నుంచి 11వ వరకు బీహెచ్ఈఎల్, మియాపూర్, కేపీహెచ్‌బీ ఈసీఐఎల్ నుంచి అవనిగడ్డకు సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. పండగ తర్వాత అవనిగడ్డ నుంచి 13, 14, 15 తేదీల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు.

గ్రామసభ బహిష్కరించిన సర్పంచి

నాగాయతిప్ప(మోపిదేవి), న్యూస్‌టుడే: సర్పంచి, పాలకవర్గ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా గ్రామసభను ఎలా నిర్వహిస్తారని నాగాయతిప్ప సర్పంచి గరికపాటి వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శిని నిలదీశారు. త్రైమాసిక గ్రామసభలు అన్ని పంచాయతీల్లో గురువారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కార్యదర్శి తీరును నిరసిస్తూ గ్రామసభను బహిష్కరిస్తున్నట్లు చెప్పి వెళ్లిపోయారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు.

☛ మెరకనపల్లి పంచాయతీ సమావేశంలో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని మందు పిచికారీ చేయించాలని జనసేన నాయకులు కోరారు. కార్యదర్శి రామకోటేశ్వరరావు స్పందించి రెండురోజుల్లో మందు పిచికారి చేయిస్తానని చెప్పారు.

వరద బాధితులకు ఆపన్న హస్తం



వంట పాత్రలు అందిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

చల్లపల్లి, న్యూస్‌టుడే: వరద బాధిత కుటుంబాలకు అవనిగడ్డ నియోజకవర్గ విద్యాకుటుంబం సాయం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం ఆయన నియోజకవర్గ విద్యాకుటుంబం రూ.29.78 లక్షలతో సాయం అందించడం అభినందనీయమన్నారు. చల్లపల్లి విజయ హైస్కూల్ వారు రూ.5లక్షలు సాయం అందించడంతోపాటు ఉపాధ్యాయులు సరకులు అందించారని తెలిపారు. ఆముదర్లంకలో విద్యాకుటుంబం ఆధ్వర్యంలో వంటపాత్రలు, దుప్పట్లు అందించారు. దాళ్వ సర్పంచి నడకుదిటి ఆదిలక్ష్మి, సేవ కె.ఈశ్వర కుమార్లకు బుద్ధప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,600 కుటుంబాలకు వరద సాయం అందించారు. ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింగళిని భారతరత్నతో గౌరవించాలి : ఎమ్మెల్యే వర్ల

పామర్రు, న్యూస్‌టుడే: మువ్వన్నెల పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మచిలీపట్నంలో మాట్లాడుతూ వైద్య కళాశాలకు పింగళి పేరు పెడతామని చెప్పడం సంతోషదాయకమన్నారు. జలవనరుల పరిధిలోని అధిక వర్షాలకు ముంపుకారణంగా పడి పంట నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని బాధిత రైతులకు నష్టపరిహారం వారి ఖాతాలకు జమ చేసిందన్నారు. ఈ క్రమంలో పలువురి రైతులకు వివిధ కారణాలతో ఇంకా సొమ్ము జమకావాల్సి ఉందని, మరికొందరి రైతుల పేర్లు సరిగా నమోదుకాలేదన్నారు. ప్రభుత్వం ప్రతి బాధిత రైతుకు న్యాయం జరిగేందుకు ఈ నెల 5 వరకు సంబంధిత వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచిందన్నారు.

సనాతన ధర్మాన్ని రక్షించుకుందాం

కోడూరు (అవనిగడ్డ): సమస్త జీవకోటి సుఖ సంతోషాలతో ఉండాలని కోరేదే హిందూ తత్వమని, అదే సనాతన ధర్మమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాద తయారీలో వైకాపా పాలనలో కల్తీ నెయ్యి వినియోగానికి నిరసనగా జనసేనాని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్ష విరమణ సందర్భంగా బుధవారం రాత్రి కోడూరు గంగమ్మ గుడి వద్ద నుంచి శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు నగర సంకీర్తన, కోలాటం ప్రదర్శన నిర్వహించారు. స్వామిని దర్శించుకున్న తర్వాత ఎమ్మెల్యే మాట్లాడుతూ ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు. గంగయ్య, సునీత, శ్రీదుర్గ, రాంబాబు, సోమశేఖర్‌రావు, దామోదర్‌రావు, ఆదినారాయణ, భాజపా నాయకుడు కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తయారు చేసిన అంశాలతో ఎంఈవో, తదితరులు

విద్యార్థులకు ప్రశంసలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: 'వేస్టు టు ఆర్టు' కృష్ణా జిల్లా కళా వైజ్ఞానిక ప్రదర్శనలో మోటారు బైక్, వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్ ట్రే, బాతులు, కార్టుబోర్డుతో తయారు చేసిన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఎంఈవో శివకుమార్ రావు ప్రశంసించారు. వాటిలో కార్డుబోర్డుతో తయారు చేసిన మోటార్ బైక్ జిల్లా ప్రథమ బహుమతికి ఎంపికైందన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.రవీంద్రబాబు, ఎంఈవో ఎ.పిచ్చయ్య, గైడ్ ఉపాధ్యాయులు సీహెచ్.వి. జయశ్రీ, ఎల్.కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ తెరపై వారాహి సభ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: తిరుపతిలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వారాహి సభ ప్రసారాన్ని ప్రజలు తిలకించడానికి కూటమి నాయకులు స్క్రీన్‌ను వంతెన కూడలిలో ఏర్పాటు చేశారు.

సేవలు అభినందనీయం

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించిన ప్రతి అధికారినీ ప్రజలు గుర్తుంచుకుంటారని తెదేపా మండల అధ్యక్షుడు వీరసవేని శివరామప్రసాద్, ఎంపీపీ రాజాఘాని పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో తుంగల కృష్ణ లత, పీఆర్ ఏఈ రామవరావు, ఏపీఎం కృష్ణరాజు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు బదిలీపై వెళ్తుండడంతో వారిని ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. జడ్పీటీసీ సభ్యుడు కొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో రామకృష్ణ మచిలీపట్నం మండల పరిషత్తుకు బదిలీపై వెళ్లారు. ఏవో ప్రమీల జిల్లా పరిషత్తుకు, ఈవోపీఆర్డీ జయప్రకాష్‌బాబు మైలవరం, పీఆర్ ఏఈ ధర్మయ్య పెడనకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా మండల పరిషత్ పాలకవర్గం, కార్యాలయ సిబ్బంది గురువారం సన్మానించారు. ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఇంజినీర్ బి.రామారావు పామర్రు మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మొవ్వ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గురువారం ఆయన్ను సత్కరించారు. మొవ్వ మండల ఏఈగా నాగాయలంక మండలం నుంచి వాసుదేవరావు బదిలీపై రానున్నారు. మొవ్వ మండల ఈవోపీఆర్డీగా విధులు నిర్వహించి వీరులపాడు బదిలీ అయిన వీర్ల సీతారామరాజును ఎంపీడీవో సుదర్శన్ వీటితోపాటు పలువురు పంచాయతీ కార్యదర్శులు గురువారం సాయంత్రం సత్కరించారు.

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాల వీఆర్వోలు వీర్ల నాగేశ్వరరావు, గిరిప్రసాద్, సర్వేయర్ ప్రసన్నలు అందించిన రెవెన్యూ సేవలు అభినందనీయమని సర్పంచి బి.వెంకటేశ్వరమ్మ అన్నారు. గురువారం బదిలీపై వెళ్తున్న పలువురు రెవెన్యూ అధికారులను ఘంటసాల పంచాయతీ కార్యాలయంలో సత్కరించారు. ఈవో టి.జయలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

అవనిగడ్డ, న్యూస్‌టుడే: వైకాపా అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతంరెడ్డి అన్నారు. గురువారం స్థానిక వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ఎన్నికల మేనిఫెస్టో అమలులో వైఫల్యం చెందిందన్నారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, ఎంపీపీ తుంగల సుమతి, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పంచాయతీగా తీర్చిదిద్దుకుందాం

పులిగడ్డ(అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: పులిగడ్డను స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి గ్రామస్థుల సహకారం అవసరమని పంచాయతీ ఈవో బి.అనిత అన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దాసరి విజయ్‌కుమార్ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈవో అనిత మాట్లాడుతూ... వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను రహదారులపై వేయవద్దని చెప్పారు. ఉప ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణికుడి బ్యాగులోని నగదు చోరీ

హైదరాబాద్, న్యూస్‌టుడే: రైల్లో నగరానికి వస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు బ్యాగులోని రూ.లక్షన్నర నగదు చోరీకి గురైంది. కృష్ణా జిల్లా గుడివాడ, రాజేంద్రనగర్‌కు చెందిన పల్లెం త్రివేణికుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. నగరంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చేందుకు గుడివాడ రైల్వేస్టేషన్ నుంచి బీదర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరారు. గురువారం తెల్లవారు జామున 4.10 గంటలకు మెలకువ వచ్చి చూసుకోగా.. సీట్ కింద ఉంచిన బ్యాగు కనిపించలేదు. బ్యాగులో దుస్తులతోపాటు రూ.1.5 లక్షల నగదు ఉండటంతో అంతా వెతికారు. చివరికి బ్యాగును బాత్‌రూంలో ఉన్నట్లుగా గుర్తించి చూడగా.. అందులోని నగదు కనిపించలేదు. ఈ సమయంలో రైలు కాజీపేట్ ప్రాంతంలో ఉండటంతో రైల్లో సికింద్రాబాద్‌కు చేరుకున్న అనంతరం జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని కాజీపేట్‌కు బదిలీ చేస్తున్నారు.

ఎడ్లబండిని ఢీకొట్టి తీవ్ర గాయాలు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : భద్రిరాజుపాలెం వద్ద కరకట్టపై గురువారం రాత్రి ఎడ్లబండిలో అక్రమంగా ఇసుక లోడింగ్ చేసుకొని వెళ్తున్నారు. బాజీ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ ఎడ్లబండి కనబడకపోవడంతో వెనుక నుంచి బలంగా ఢీ కొట్టాడు. దీంతో కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడని ఎస్సై అర్జునరాజు తెలిపారు. రాత్రి సమయాల్లో ఎడ్లబండిపై అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరికలు జారీ చేశారు. ఎడ్లబళ్లతో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రవాణా చేసుకోవాలని సూచించారు.

కొరవడిన పర్యవేక్షణ.. ఆగని ఇసుక రవాణా

తోట్లవల్లూరు మండలంలోని కృష్ణానది ఒడ్డున పలు గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా రాత్రిళ్లు జోరుగా సాగుతోంది. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు ఎడ్లబళ్ల ద్వారా రవాణా చేస్తున్నారు. వరద వచ్చి తగ్గుముఖం పట్టడంతో ఇసుక బయట పడిన గ్రామాల నుంచి ఎడ్ల బళ్లతో రాత్రిళ్లు ఇసుక అక్రమ రవాణా జోరుగా చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. రాత్రి సమయాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ పెంచి ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

కూరాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: కూరాడకు చెందిన శాయన నాగవంశి, జగదీశ్వరి ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. లారీ డ్రైవర్‌గా పనిచేసే వంశీ కొంతకాలంగా భార్యపై అనుమానంతో తరచూ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

తమ్ముడిపై అన్నకుటుంబం దాడి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరంలో ఆస్తి వివాదంతో ఏర్పడ్డ ఘర్షణలో తమ్ముడైన మన్నెం లక్ష్మణరావు(చంటి)పై అన్న రమేశ్ అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపర్చడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.



వేకనూరులో బాలాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు



అవనిగడ్డ మండలం అశ్వరావుపాలెంలో..



అవనిగడ్డ శివాలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారు



కంచి కామాక్షి



కోడూరులో..



పెదకళ్లేపల్లిలో..



పెదప్రోలు నాగమల్లేశ్వర స్వామి దేవాలయంలో..



విద్యుత్తు వెలుగుల్లో పెదకళ్లేపల్లి నాగేశ్వరస్వామి ఆలయం



చల్లపల్లిలో..



చల్లపల్లి: రామానగరంలో..



గుడివాడ కన్యకా పరమేశ్వరీ దేవిగా



చిట్టూర్పు శివాలయంలో అమ్మవారు



గణపేశ్వరంలో విజయ దుర్గాదేవిగా..



గుడివాడ మండలం చిన ఎరుకపాడులో..



పామర్రు : బాలా త్రిపురసుందరి



పామర్రు : పార్వతి అమ్మవారు



కూచిపూడి: అమ్మవారికి దీక్షా వస్త్రాలు అందిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

దసరా శరన్నవరాత్రి వేడుకలు గుడివాడ, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అన్ని గ్రామాల్లోని ఆలయాలతోపాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద దుర్గాదేవికి కుంకుమార్చనలు, బాలకుమారి, సుహాసిని పూజలు, చండీహోమం వంటి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, అర్చకులు అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. గుడివాడ పట్టణంలోని భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్వామికి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. - న్యూస్‌టుడే బృందం



స్వామికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



కొండిపర్రులో..



కూచిపూడి: పెదముత్తేవిలో..



గుడ్లవల్లేరు: కూరాడ లాకుదిగువన..




తోట్లవల్లూరు శివాలయంలో..



వెంట్రప్రగడ నామేశ్వరస్వామి దేవస్థానంలో..



లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..



పమిడిముక్కల : పార్వతీశ్వరస్వామి ఆలయంలో



గుడివాడ భీమేశ్వర స్వామి ఆలయంలో..



త్రయంబకేశ్వర స్వామిగా..

ప్రాచీన కళలను ప్రోత్సహించి ఆదరించాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తెదేపా నాయకులు

చిట్టూర్పు,(ఘంటసాల), న్యూస్‌టుడే: ఆధునిక సమాజంలో ప్రాచీన కళలను ప్రోత్సహించి ఆదరించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం చిట్టూర్పులో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో జరిగే తాళంభజన, మురళీకోలాటం పోటీలను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు మొదట రుత్వికులు బృందం ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శివాలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వారం రోజుల పాటు జరిగే పోటీల్లో 40 తాళంభజన భక్త సమాజాలు, 9 మురళీ కోలాటం భజన బృందాలు పేర్లు నమోదు చేసుకున్నారని నిర్వాహకులు తెలిపారు. తాళంభజన పోటీల్లో భద్రిరాజుపాలెం, చిలకలపూడి, సాలెంపాలెం, పెదకళ్లేపల్లి, చినకళ్లేపల్లి గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొన్నాయి. న్యాయ నిర్ణేతలుగా తోట్లవల్లూరుకు చెందిన పొడుగు ప్రభాకరరావు, ఏసుపాదం వ్యవహరించారు. ప్రతి భక్త సమాజానికి గంట సమయం కేటాయించారు. హైదరాబాద్‌కు చెందిన మల్లిపెద్ది వెంకట నారాయణరావు, సర్పంచి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచి రాజ్యలక్ష్మి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు, పేదలకు వస్త్రదానం



వస్త్రాలు అందిస్తున్న అనసూయ దంపతులు

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: స్థానిక వాసవీక్లబ్ మాజీ అధ్యక్షురాలు, హైఫైవ్ యూత్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ-పార్థసారథి నాగేశ్వరరావు దంపతులు తమ తల్లిదండ్రులు సత్యనారాయణ-సత్యవతి, కుమారుడు రాజేశ్‌ల జ్ఞాపకార్థం గురువారం 80 మంది పారిశుద్ధ్య కార్మికులు, పేదలకు రూ. 40 వేల విలువైన నూతన వస్త్రాలను అందించారు. ఘంటసాల ఎన్టీఆర్ కళాపీఠం వ్యవస్థాపకులు కాటూరి మురళీకృష్ణకు పురస్కారం అందజేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు గోట్రు నాగబాబు, ఈడే వెంకటరామారావు, అలజంగి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీలత



కృష్ణమోహన్

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం తహసీల్దార్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా డిప్యూటీ తహసీల్దార్‌గా శ్రీలత, ఆర్ఐగా ఘంటసాల కృష్ణమోహన్‌లు బాధ్యతలు తీసుకున్నారు. వీఆర్వోలలో మాజేరుకు పరిశే కిరణ్, లక్ష్మీపురం-1 తూము శ్రీనివాసరావు, లక్ష్మీపురం-2 కోట కిరణ్‌కుమార్, లక్ష్మీపురం 3 జయరామ్, చల్లపల్లి-1 మత్తి గోపాలకృష్ణ, చల్లపల్లి 3 గొల్లపూడి రాజేంద్రకుమార్, చల్లపల్లి 4 అమలేశ్వరరావు, వక్కలగడ్డకు ప్రతిమ, ఆముదార్లంకకు పెనుమూడి వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

నాగపూర్‌లో లారీ డ్రైవర్ మృతి

కుటుంబీకుల ఫిర్యాదుతో శవపరీక్ష

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: తిరువూరుకు చెందిన ఓ లారీ డ్రైవర్ నాగపూర్‌లో మరణించాడు. ఆయన మృతదేహాన్ని క్లీనర్ గురువారం హనుమాన్‌జంక్షన్ తీసుకొచ్చాడు. ఎస్సై జనార్ధన్ కథనం ప్రకారం.. బంకా ఏసురత్నం(48) హనుమాన్‌జంక్షన్‌లోని వీరాంజనేయ లారీ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీపై దిల్లీ వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగపూర్‌లో ఆగాడు. అక్కడ అస్వస్థతకు గురై ఈ నెల 2న ప్రాణాలు కోల్పోయాడు. దీంతో లారీ క్లీనర్ అంబులెన్సులో మృతదేహాన్ని హనుమాన్‌జంక్షన్ తీసుకువచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష చేయించారు.





మౌలిక వసతులకు పెద్దపీట


పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. వేలేరులో ఆర్డీఎస్ఎస్ పథకం కింద రూ.50లక్షల వ్యయంతో విద్యుత్తు సరఫరా మెరుగుపర్చేందుకు వీలుగా పనులు చేపట్టారు. గురువారం ఎమ్మెల్యే భూమిపూజ చేసి వీటిని లాంఛనంగా ప్రారంభించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్తు ఛార్జీల భారం దారుణంగా మోపడంతో పాటు, సరఫరా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, వీటిని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కృషి చేస్తున్నారని యార్లగడ్డ తెలిపారు. సీపీడీసీఎల్ ఏడీఈ శ్రీనివాసరావు, ఏఈ మురళీకృష్ణ, తెదేపా నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, అవిర్నేని భవానీశంకర్, కాజా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే సమీక్ష

పెనమలూరు, న్యూస్‌టుడే : పెనమలూరు నియోజకవర్గంలోని ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ శుక్రవారం సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో ఆయన తన కార్యాలయంలో వివిధ అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్షిస్తారు. సమావేశం 3 గంటలకు ప్రారంభం అవుతుంది.

తాడిగడపలో బైక్ చోరీ

పెనమలూరు, న్యూస్‌టుడే : తాడిగడపలో ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. జె. రాంబాబు అనే వ్యక్తి ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంటారు. ఆయన వారం కిందట తన ద్విచక్రవాహనాన్ని ఇంటి వద్ద పార్క్ చేశారు. తర్వాత రోజు ఉదయం చూడగా కనిపించలేదు. పెనమలూరు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: మానవతా స్వచ్ఛంద సంస్థ ఉయ్యూరు శాఖ ప్రతినిధులు ఇంజినీరింగ్ విద్యార్థినికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందించారు. ఆమె ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతోంది. సంస్థ ఉయ్యూరు శాఖ ఛైర్మన్ కొలసాని రవికుమార్, అధ్యక్షుడు సాకి రాజేష్, ఉపాధ్యక్షుడు శివకృష్ణ తదితరులు అందించారు.

వృద్ధులకు చేయూత

కానూరు, న్యూస్‌టుడే: కానూరు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు బి.గౌరీశంకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లింగంశకుంతల, జె.ప్రభాకర్‌లు బిస్కట్లు, పండ్లు, నిత్యావసర సరకులు అందించారు.


సాంకేతికతతో పెట్టుబడి ఆదా


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో తేజస్వి


గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా పెట్టుబడి ఆదా అవుతుందని ఏవో ఎన్.లక్ష్మీతేజస్వి సూచించారు. గన్నవరం మండలం ముస్తాబాద, సూరంపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రైతులు కడియాల చిట్టిబాబు, గంపెన రవి పొలాలను పరిశీలించారు. అధికారులు డ్రోన్ సాయంతో పురుగు మందును పిచికారీపై అవగాహన కల్పించారు. సస్యరక్షణపై పలు సూచనలు, సలహాలు చేశారు. రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవఎరువుల వినియోగంతో దిగుబడులు

పెనమలూరు, న్యూస్‌టుడే : జీవ ఎరువుల వినియోగంతో నాణ్యమైన పంటల దిగుబడులు ఉంటాయని కృష్ణా జిల్లా వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మనోహర్ పేర్కొన్నారు. తాడిగడప, పెదపులిపాకల్లో గురువారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. అనంతరం ఆయన ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వివరించారు. సహాయ సంచాలకులు ఎం.సునీల్, మండల వ్యవసాయశాఖాధికారి కనకమేడల శైలజ, వీఏఏ లు గోవర్ధని, శ్రీవాణి, తాడిగడప, పెదపులిపాక రైతులు పాల్గొన్నారు.








పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.25లక్షల వ్యయంతో పలు రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించారు. గురువారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశంలో వీటికి సాంకేతిక అనుమతులు కోరుతూ తీర్మానం చేశారు. ముఖ్యంగా జగనన్నకాలనీ ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున సత్వరం దానిని బాగు జేయాలని నిర్ణయించారు. వీటితో పాటు పలు పనులకు, బిల్లులకు ఆమోదం తెలిపారు. సర్పంచి కమలాబాయి, ఉపసర్పంచి దుట్టా శివన్నారాయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బదిలీపై కేసరపల్లి వెళ్తున్న ఈవో సీహెచ్ ప్రసాద్‌కు, ఇతర సిబ్బందికి ఘనంగా సన్మానం చేశారు.





పురపాలికలో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం



శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, పాల్గొన్న వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : తాడిగడప పురపాలికలోని అన్ని సర్కిళ్లలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. గురువారం కానూరు మురళీనగర్‌లో సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. కమిషనర్ భవానీప్రసాద్, వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవికిరణ్, అంగిరేకుల మురళి, గుంటుపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల ఐక్యత ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: కౌలు రైతులు సమస్యల్ని సాధించుకునేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని, ఐక్య ఉద్యమాలతోనే సమస్య పరిష్కారం అవుతాయని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు అన్నారు. జిల్లా కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉయ్యూరులోని శ్రామిక భవన్‌లో ఏర్పాటైన కార్యక్రమానికి హరిబాబు హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు ఎలాంటి న్యాయం చేయడం లేదన్నారు. సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రంగారావు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న సదస్సుకు కౌలు రైతులు పెద్దఎత్తున తరలి రావాలన్నారు. కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి కోసూరి శివనాగేంద్రం పర్యవేక్షించారు.

వృద్ధులకు చేయూత

కానూరు, న్యూస్‌టుడే : కానూరు వృద్ధాశ్రమంలోని వారికి బి.గౌరీశంకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు లింగంశకుంతల, జె.ప్రభాకర్‌లు తమ వంతు సాయంగా చేయూత అందించారు. గురువారం వారికి బిస్కట్లు, పండ్లు, నిత్యావసర వస్తువులు అందించారు.

విద్యుత్తు శాఖ ఎస్ఈకి తెదేపా నేతల అభినందన

కానూరు, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈగా కొత్తగా నియమితులైన సత్యానందంను కానూరు తెదేపా నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. పూలకుండీ అందించారు. గతంలో ఇక్కడ సమర్థంగా పనిచేసి మళ్లీ ఇప్పుడు ఉన్నత అధికారిగా బాధ్యతలు చేపట్టడం పట్ల అంగిరేకుల మురళి, మట్టపూడి చంద్రబాబులు హర్షం వ్యక్తం చేశారు.







పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

ప్రయాణికుల ఇబ్బందులు పట్టవా?

బస్‌షెల్టర్లు లేక 5 సంవత్సరాలుగా ఇబ్బంది


కామయ్యతోపు సెంటర్లో ఎండలో నిల్చొని..


ఇంజినీరింగ్ కళాశాల వద్ద విద్యార్థుల పాట్లు

కానూరు, తాడిగడప, న్యూస్‌టుడే : బందరు రోడ్డు విస్తరణ నేపథ్యంలో పురపాలిక పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బస్సు షెల్టర్లను తొలగించారు. వానల తరువాత ఎండలతో ప్రజలు, విద్యార్థులు ఎండలోనే మగ్గుతున్నారు. రోడ్డు విస్తరణకు పూర్వం అన్ని ప్రాంతాల్లో బందరు రోడ్డుకు రెండు వైపులా బస్సుషెల్టర్లు ఉండేవి. ఇపుడు వైఎస్ఆర్ తాడిగడప పురపాలిక పరిధిలోని ప్రాంతాల్లో ఒక్కటంటే ఒక్క బస్టుషెల్టరు కూడా లేక ప్రజలు అల్లాడుతున్నారు. విస్తరణ పూర్తయింది.. ఇంకా సర్వీసు రోడ్ల పని మిగిలి ఉంది.

కూడళ్లు.. షెల్టర్ల ప్రాంతాలు ఇవీ..

టైమ్ ఆసుపత్రి సెంటర్, పప్పుల మిల్లు, కామయ్యతోపు, కేసీపీ కాలనీ, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, తాడిగడప, పోరంకి, పెనమలూరు. .. ఈ కూడళ్లలో గతంలో బందరు రోడ్డుకు రెండు వైపులా బస్సు షెల్టర్లు ఉండేవి. మొత్తం 8 ప్రధాన కూడళ్లలో ఇరువైపులా కలిపి 16 బస్సు షెల్టర్లు ఉండేవి. కామయ్యతోపు సెంటర్ నుంచి విస్తరణ నేపథ్యంలో 120 అడుగుల మేర అడ్డుగా ఉన్న అన్నింటిని తొలగించారు. అన్ని బస్సు షెల్టర్లు తీసివేశారు. ఈ 8 కూడళ్లలో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల కూడలి ప్రధానమయినది. అక్కడ మాత్రమే దాదాపు 10 వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇటువంటి ఈ ప్రాంతాలలో ఈ ఎండా కాలంలో, వానాకాలంలో బస్సుషెల్టర్లు లేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సర్వీసు రోడ్లు ఏర్పాటు చేసే వరకు తాత్కాలికంగా అయినా బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్ఆర్ తాడిగడప పురపాలిక సమాచారం..

బందరు రోడ్డుపై పరిధి:	చెక్‌పోస్టు సెంటర్ నుంచి పెనమలూరు సెంటర్ వరకు
మొత్తం ఎన్ని :	5 కిలోమీటర్లు కిలోమీటర్లు
సర్కిల్స్ మొత్తం :	4
మొత్తం గతంలో ఉన్న బస్సు షెల్టర్లు :	16
ప్రయాణించే వారి సంఖ్య :	25,000
ఇప్పుడు ఏర్పాటు చేయాల్సిన బస్సు షెల్టర్లు :	16
మొత్తం కూడళ్లు :	8

పోలవరం కాల్వలో మృతదేహం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: బాపులపాడు మండలం వేలేరు వద్ద పోలవరం కుడి కాల్వలో గురువారం గుర్తు తెలియని మృతదేహం తేలుతూ కన్పించింది. దీంతో స్థానికులు హనుమాన్‌జంక్షన్ పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు మృతదేహాన్ని బయటకు చేర్చారు. సుమారు 45 ఏళ్ల వయసున్న ఇతను ఎవరనేది ఆచూకీ తెలియలేదు. ఎగువన ఎక్కడన్నా మునిగిపోయి ప్రాణాలు కోల్పోయిన తర్వాత మృతదేహం ఇక్కడకు కొట్టుకు వచ్చిందా, లేక సమీప ప్రాంతాలకు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కాని, ఉద్దేశపూర్వకంగా కాల్వలో పడిపోయారా అన్న విషయంపై స్పష్టత రాలేదు. మృతుడు లుంగీ, జుబ్బా ధరించి ఉన్నాడని, కుడికాలికి నాలుగు వేళ్లు మాత్రమే ఉన్నాయని ఎస్సై జనార్దన్ వివరించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందనలు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: తిరుపతిలో ఈ నెల 6 నుంచి మూడు రోజులు జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు పాఠశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని ప్రసాదంపాడు సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని సిస్టర్ అరుణ మేరీ తెలిపారు. ఇటీవల విజయవాడలో జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య(అండర్-14, 17) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో తమ స్కూల్‌కు చెందిన ఎస్.నాగ వెంకట శ్రీనిక, ఎం.మాధవ్‌లు మెరుగైన ప్రతిభను ప్రదర్శించి అండర్-17 జట్టులో స్థానం సాధించారని పేర్కొన్నారు. గురువారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను, కోచ్ అంకమ్మరావును పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


క్రీడాకారులతో సిస్టర్ అరుణ మేరి

కొనకళ్ల ప్రమాణ స్వీకారం నేడు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ఆర్టీసీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాస్ కోరారు. విజయవాడలోని ఏపీఎస్ఆర్టీసీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం సాయంత్రం 5గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అభినందన సభ జరుగుతుందన్నారు.

జగన్మాతా పాహిమాం


ఈడుపుగల్లు కాలువ గట్టు రోడ్డులో విగ్రహం వద్ద పూజలు


ఉప్పలూరులో భవానీ దీక్షధారులు


కంకిపాడు : కన్యకాపరమేశ్వరి మందిరంలో


పోరంకి: శ్రీ కోదండ రామాలయంలో అలంకరణలో స్వామివార్లు


బాలాత్రిపుర సుందరీదేవిగా రామవరప్పాడులోని పేరంటాలమ్మవారు

న్యూస్‌టుడే బృందం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో ఉన్న జగన్మాతను దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామాల్లో ప్రత్యేక మండపాల్లో అమ్మవార్ల విగ్రహాలను, ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరిస్తున్నారు.


కొత్తపల్లిలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారు


ఉయ్యూరులోని IIవ వార్డు సందరయ్యనగర్‌లో


యనమలకుదురులో శైలపుత్రి అలంకరణ


కంకిపాడు శివాలయంలో బాలత్రిపురసుందరీదేవిగా


పాతగన్నవరంలో కనకదుర్గమ్మకు భక్తుల పూజలు


ఉంగుటూరు మండలం ఆత్కూరులో..


మద్దూరులో బాలా త్రిపురసుందరీదేవిగా


విశేషాలంకరణలో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి


శ్రీనివాస్‌నగర్‌లో బాలా త్రిపురసుందరీదేవిగా


ఉయ్యూరు విజయదుర్గాదేవి ఆలయంలో..


ఉయ్యూరు: శివాలయంలో


హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో

కబ్జాకోరల నుంచి కోలవెన్ను ఛానల్‌కు విముక్తి

స్పందనకు వందనం

పెనమలూరు, న్యూస్‌టుడే : కబ్జా కోరల నుంచి కోలవెన్ను ఛానల్‌కు విముక్తి లభించింది. కాలువను పూడ్చేసిన అక్రమ లేఔట్ల వ్యాపారితోనే జలవనరుల శాఖ అధికారులు కాలువ స్థిర వెడల్పు చేయించి హెచ్చరించారు. ఐదు గ్రామాల్లోని 1500 ఎకరాలకు సాగునీరందించే ఈ కాలువను పూడ్చి కాలువకట్ట రహదారిని తనకు అనుకూలంగా వెడల్పు చేస్తుండటంపై 'ఈనాడు'లో శుక్రవారం వెలువడిన 'కోలవెన్ను ఛానల్ కబ్జా' కథనం జలవనరుల శాఖ అధికారుల్లో కదలిక తెచ్చింది. ఉదయం ఆ శాఖ ఏఈ నాగబాబు, ఇతర అధికారులు పూడ్చిన కాలువ, తవ్వేసి వెడల్పు చేసిన కాలువ కట్టను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వ్యాపారి తనకు అనుకూలంగా ఒక్కో చోట ఒక్కో రీతిలో ఫర్లాంగు పొడవునా కాలువను పూడ్చుకుంటూ జాతీయ రహదారి వరకూ దందా సాగించినట్లు గుర్తించారు. కొన్ని చోట్ల రెండడుగులు, మరికొన్ని చోట్ల మూడడుగుల మేర కాలువను పూడ్చినట్లు నిర్ధారించుకొన్నారు. దిగొచ్చిన అక్రమ లేవుట్ల వ్యాపారి ఉదయం 7 గంటలకే జేసీబీతో ప్రత్యక్షమై పూడ్చిన కాలువను సరిచేయడం మొదలుపెట్టాడు. ఇది గుర్తించిన జలవనరులశాఖ ఏఈ నాగబాబు వ్యాపారిని హెచ్చరించారు. వ్యాపారి అక్రమాలపై వెంటనే నోటీసులను ఇవ్వనున్నట్లు నాగబాబు తెలిపారు. కాలువ ఆక్రమణ, పూడ్చివేతలపై అధికారులు స్పందించిన తీరుపై రైతులు అభినందించారు. అక్రమ లేఔట్ పైనా సీఆర్‌డీఏ, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పూడ్చేసిన ఛానల్‌ను పరిశీలిస్తున్న అధికారులు


పూడ్చిన కాలువను సరిచేస్తున్న పొక్లెయిన్

పెనమలూరు ఎంపీడీవోగా బండి ప్రణవి

పెనమలూరు, న్యూస్‌టుడే : పెనమలూరు ఎంపీడీవోగా బండి ప్రణవి బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సునీతాశర్మ ఇబ్రహీంపట్నం మండలానికి బదిలీ కాగా ఈ స్థానంలో ప్రణవి నియమితులయ్యారు. ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా గుర్రం ఓంకార్‌నాథ నాగేశ్వరరావు, ఈవోపీఆర్‌డీగా బొమ్మసాని శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు. వారు గురువారం బాధ్యతలు స్వీకరించారు.

లాల్ బహాదుర్ శాస్త్రి రోడ్డుగా నామకరణం చేయాలి

పోరంకి, న్యూస్‌టుడే : వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని తాడిగడప 100 అడుగుల రోడ్డుకు మాజీ ప్రధాని డాక్టర్ లాల్ బహాదుర్ శాస్త్రి పేరుతో నామకరణం చేయాలని జాతీయ నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌ను పోరంకిలోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఇంటూరి మురళీకృష్ణ, మారుతి సురేష్ బాబు, అన్నవరపు శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌కి అర్జీ అందజేస్తున్న నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు, తదితరులు

దాడి ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా శక్తిపటాల ఏర్పాటు విషయంలో నెలకొన్న దాడి ఘటనలో బలరామునిపేటకు చెందిన త్రినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కుటుంబీకుల కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి దాటాక శక్తిపట పందిరి వద్ద డీజేల సౌండ్ ఎక్కువగా ఉండడంతో ప్రశ్నించేందుకు వెళ్లిన త్రినాథ్‌కు అదే ప్రాంతానికి చెందిన సాయి, శివ తదితరుల మధ్య వివాదం రాజుకుంది. దీంతో సాయి, మరికొందరు అతని మిత్ర బృందం కలిసి త్రినాథ్‌పై దాడి చేయడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచన మేరకు విజయవాడ తీసుకెళ్లారు. ఈ ఘటనపై గురువారం కేసు నమోదు చేసిన ఆర్‌పేట పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. తన కుమారుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడి తల్లి బడుగు అరుణకుమారి, కుటుంబ సభ్యులు కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదులు సమర్పించారు.

విద్యుత్తు విజిలెన్స్ అధికారుల తనిఖీ

పెడన గ్రామీణం: మండల ఎస్వీపల్లె శివారు దిరశవల్లి గ్రామంలో అక్రమ విద్యుత్తు వినియోగంపై వచ్చిన ఫిర్యాదులపై విజయవాడ విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. రొయ్యలు, చేపల చెరువుల మీద ఉన్న కనెక్షన్లు, ఇళ్ల కనెక్షన్లు పరిశీలించారు. స్థానిక విద్యుత్తు శాఖాధికారులకు సమాచారం లేకుండా నేరుగా గ్రామానికి వెళ్లి తనిఖీ చేశారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఏ ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్ల సాధనలో భాగంగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు గురవారం మచిలీపట్నం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో అవసరం మేరకు సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పదోన్నతులు కల్పించాలని, అర్హులైన వారిని పట్టణ ఎంఈవోలుగా నియమించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బి.కనకారావు, జె.లెనిన్‌బాబు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు పీఎఫ్ సమస్యలు పరిష్కరించి త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. సంఘం నగర అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు సీహెచ్ రాజాశ్రీధర్, టి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ డిమాండ్లు పరిష్కరించకుంటే నిర్దేశించిన కార్యాచరణ మేరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న నాయకులు, ఉపాధ్యాయులు

నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేలా చర్యలు

గండిగుంట(ఉయ్యూరు(గ్రామీణం), న్యూస్‌టుడే : వ్యవసాయావసరాలకు సరఫరా అయ్యే విద్యుత్తులో ఎటువంటి అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. తెదేపా నేత వల్లభనేని నాగభూషణరావు (భూషయ్య) తల్లి సత్యనాగ భానుమణి ఇటీవల మృతి చెందారు. గురువారం గండిగుంట గ్రామంలో నివాసంలో ఉన్న నాగభూషణరావు, ఆయన సోదరుడు చంద్రశేఖర్, కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు.


సత్యనాగ భానుమణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

'తుమ్మలపల్లి'కి అభినందన

కంకిపాడు, న్యూస్‌టుడే : పెనమలూరు నియోజకవర్గానికి చెందిన దస్తావేజు లేఖరుల వృత్తిదారుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, దాత, తెదేపా సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ విజయవాడ దుర్గగుడి దసరా ఉత్సవ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, ధార్మిక, బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలు త్రికరణ శుద్ధిగా నిర్వహిస్తానని హరికృష్ణ చెప్పారు.


హరికృష్ణ

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

కంకిపాడు న్యూస్‌టుడే : ఈడుపుగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి అథెటిక్స్ పోటీల్లో కంకిపాడులోని సెయింట్ మేరీస్ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ సాల్మన్ రాజు ఒక ప్రకటలో తెలిపారు. బి.ధోని, వి.మణికంఠ, బి.జోత్స్న వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. విజేతలతోపాటు వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను గురువారం అభినందించారు.


విద్యార్థులతో కరస్పాండెంట్ సాల్మన్‌రాజు

మంగళకరం.. పంచహారతుల వీక్షణం


హిందూ సంప్రదాయంలో హారతికి ఎంతో ప్రాధాన్యం ఉంది. మనం చేసే పూజలు ఫలించాలంటే ఇది తప్పనిసరి. ఒకవేళ ఇవ్వకపోతే అసంపూర్ణంగా భావిస్తారు. అలాంటిది ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను స్తుతిస్తూ రుత్వికులు నిత్యం పంచహారతులు సమర్పిస్తారు. సమస్త లోకం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ వీటిని ఇస్తారు. హారతి వలన మంగళం కలుగుతుందని భక్తుల నమ్మకం. దసరా వేడుకల్లో వివిధ రూపాల్లో ఉన్న జగన్మాత దుర్గమ్మకు వీటిని కనుల పండువగా ఇస్తారు. వీటిని తిలకించేందుకు రెండు కళ్లు సరిపోవంటే అతిశయోక్తి కాదు.
– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



అన్ని నక్షత్ర రాశుల వారికి..

పంచహారతుల్లో చివరిది నక్షత్ర హారతి. సకల నక్షత్ర రాశుల వారి వీక్షణార్థం ఈ హారతిని అమ్మవారికి సమర్పిస్తారు. 27 నక్షత్రాల్లో జన్మించిన వారు రాశీ ఫలాలతో సంబంధం లేకుండా వీక్షిస్తే ప్రయోజనం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం.

అన్ని మంత్రాలకు మూలం ఓంకారం



సాయం సంధ్యవేళ నివేదన అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఓంకార హారతి ఇస్తారు. అన్ని మంత్రాలకు మూలం ఓంకారం. ఓంకార రూపాన్ని వీక్షించడంతో సమస్త పాపాలు తొలగిపోతాయన్నది భక్తుల విశ్వాసం.

దీర్ఘాయువును ప్రసాదించే నాగదేవత



పంచహరతుల్లో రెండవది నాగ హారతి. దేవతా స్వరూపమైన నాగ సర్పం దీర్ఘాయువుకు పవిత్రతకు ప్రతీక. నాగ హారతిని దర్శించడం వలన సకలరోగాలు నివారించబడతాయని భక్తుల నమ్మకం. దీంతోపాటు సర్పదోషాలు తొలగిపోతాయి.

భూమండలాన్ని రక్షించే కుంభహారతి



పంచహారతుల్లో నాల్గోది కుంభ హారతి. సమస్త భూమండలాన్ని రక్షించే ఈ హారతిని తిలకించడంతో జీవ రక్షణ లభిస్తుంది. సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. భక్తులకు అనన్యమైన పుణ్యం సిద్ధిస్తుంది.

పరమేశ్వరుని పంచముఖాలకు ప్రతిరూపం



జగన్మాత దుర్గమ్మకు ఇచ్చే మహిమాన్వితమైనది పంచహారతి. పరమేశ్వరిని పంచముఖాలకు ప్రతి రూపంగా దీన్ని భావిస్తారు. ఈ హారతిని వీక్షిస్తే భక్తులకు పంచ మహాపాతకాలు తొలగుతాయి. పంచప్రాణాలకు సాంత్వన కలుగుతుంది. దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సంపూర్ణ అనుగ్రహం కలుగుతుందని భక్తుల నమ్మకం.

ఇంద్రకీలాద్రిపై వైభవంగా దసరా ఉత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూలవిరాట్ దుర్గమ్మకు శాస్త్రోక్తంగా స్నపనాభిషేకం రుత్వికులు నిర్వహించారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని యాగశాలలో కలశ ప్రతిష్ఠ నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారికి ప్రీతి పాత్రమైన బాల పూజను మల్లికార్జున మహామండపంలో ఆరో అంతస్తులో నిర్వహించారు. అప్పటికే క్యూలైన్లు భక్తులతో కిటకిట లాడాయి. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లో ప్రవేశించిన భక్తులు దుర్గగుడి టోల్‌గేటు నుంచి ఘాట్ రోడ్డు మీదుగా అమ్మవారిని దర్శించుకున్నారు. మల్లేశ్వరస్వామి దర్శనం చేసుకున్న అనంతరం భక్తులు మెట్ల మార్గంలో కనకదుర్గానగర్‌కు చేరుకున్నారు.



కుంకుమ పూజలో భక్తులు

ఆర్జిత సేవల సందడి..


జగన్మాత దుర్గమ్మకు ఆర్జిత సేవలు నిర్వహించారు. మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో రెండు విడతలుగా దుర్గమ్మ ఉత్సవమూర్తి వద్ద రుత్వికులు ప్రత్యేక కుంకుమార్చన చేశారు. ఆర్జిత సేవలో 300 మంది మహిళలు అమ్మవారి రూపానికి కుంకుమ పూజ చేశారు. అనంతరం వీరిని ప్రత్యేక క్యూలైనులో అమ్మవారి దర్శనానికి పంపారు. వేద పారాయణ, రాజగోపుర ప్రాంగణంలో శ్రీచక్రనవావర్ణార్చన, యాగశాలలో ప్రత్యేక చండీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు.

❖ దుర్గమ్మ దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయం మెట్ల మార్గం మీదుగా అన్నప్రసాద పంపిణీ కేంద్రానికి చేరుకొని ప్రసాదాన్ని స్వీకరించారు. మల్లేశ్వరాలయ మెట్ల మార్గం వద్ద భక్తుల రద్దీ కనిపించింది. రానున్న రోజులను దృష్టిలో ఉంచుకొని అన్నప్రసాదానికి ఆటంకం లేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

నేటి అలంకారం

4-10-2024, శుక్రవారం

శ్రీ గాయత్రీ దేవి



"ఓం బ్రహ్మాస్త్రకుండికాస్త్రాం శుద్ధ జ్యోతి స్వరూపిణీం సర్వతత్త్వమయీం వందే గాయత్రీం వేదమాతరం"

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు జగన్మాత దుర్గమ్మను వేదమాత గాయత్రీదేవిగా అలంకరిస్తారు. పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠాన దేవతగా అమ్మవారిని కొలుస్తారు. కొబ్బరిఅన్నాన్ని నివేదనగా సమర్పిస్తారు. సకల మంత్రాలకు, వేదాలకు మూలమైన దేవతగా గాయత్రీదేవి ప్రసిద్ధి. మహత్తర శక్తిగల జగన్మాత ఐదు ముఖాలతో వరదాభయ హస్తాలు ధరించి కమలాసనాసీనురాలిగా నేడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

భక్తులకు సౌకర్యాలు బాగా కల్పించారు

❖ దసరా ఏర్పాట్లకు దేవాదాయ శాఖ మాజీ మంత్రి కితాబు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని చేసిన ఏర్పాట్లు బాగున్నాయని దేవాదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. దసరా శరన్నవరాత్రి వేడుకలను పురస్కరించుకొని గురువారం బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో ఉన్న దుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలని ప్రజలు సుఖశాంతులతో విరాజిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు కూడా భక్తులకు సౌకర్యాలు బాగా కల్పించారన్నారు. భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున మరింత మెరుగ్గా అధికారులు పనిచేస్తారని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, క్యూలైన్లు అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు.



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

సామాన్యులకు చక్కటి దర్శనం అందించడమే లక్ష్యం

❖ దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి



అమ్మవారి సన్నిధిలో దేవాదాయశాఖ మంత్రి రామనారాయణరెడ్డి, సమాచారశాఖ మంత్రి పార్థసారథి



హోం మంత్రి అనితకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న వేదపండితుడు

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే : సామాన్య భక్తులు ఇబ్బంది పడకుండా అమ్మవారి దర్శనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో గురువారం శ్రీబాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారిని తొలి దర్శనం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఇంద్రకీలాద్రిపై ఉత్సవాల ఏర్పాట్లు వైభవంగా చేశామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ఈ ఉత్సవాలను విజయవంతం చేస్తామన్నారు. ప్రతి భక్తుడికి అన్న ప్రసాదం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. అమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుటుంబసమేతంగా వచ్చి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, సమాచార శాఖ మంత్రి పార్థసారథి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.విజయ్ తొలిరోజు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఎమ్మెల్యే సుజనా చౌదరికి అమ్మవారి చిత్రం పటం అందజేత

56 మందితో ఉత్సవ కమిటీ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 56 మందితో సేవా కమిటీని ఏర్పాటు చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీలో తెదేపా, జనసేన, భాజపాలకు చెందిన నాయకులు, ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు ఉన్నారు.

అమ్మవారి పేరుతో ప్రత్యేక రైలు నడపాలి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : దేశంలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ఆయా క్షేత్రాలు, దేవతామూర్తుల పేర్లతో రైళ్లు నడుపుతున్న నేపథ్యంలో విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారు, ఇంద్రకీలాద్రి పేర్లతో ఒక రైలు నడపాలని ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ రైల్వే జీఎంకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాష్ట్ర ఎంపీలతో నిర్వహించనున్న సమావేశంలో ఎంపీలంతా ఈ విషయాన్ని జీఎం ముందు ప్రస్తావించాలని కోరారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల విధుల్లో ప్రతి సెక్టారులోని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఆదేశించారు. ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాల్లో వివిధ సెక్టార్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును జిల్లా కలెక్టర్ సృజన, ఏడీసీపీలతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలన చేశారు. కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బందికి అందజేసిన భోజనాల నాణ్యత ఏ విధంగా ఉందో తెలుసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సిబ్బంది వ్యవహరించాలన్నారు. సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ కెమెరాల్లో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ

చిట్టినగర్, న్యూస్‌టుడే : భక్తులకు కల్పించే సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. దసరా ఉత్సవాల తొలి రోజు గురువారం అమ్మవారిని కలెక్టర్ దర్శించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు లక్షకు పైగా వస్తారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు, వృద్ధులకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శన సమయం కేటాయించామన్నారు. ఆ సమయంలో వచ్చి దర్శనం చేసుకోవాలని సూచించారు. వీఐపీలను ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అనుమతిస్తామన్నారు. అవసరం మేర చిన్న చిన్న మార్పులు చేస్తూ మెరుగైన సేవలు అందిస్తూ ఉత్సవాలను విజయవంతం చేస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

బోగస్ సంస్థలతో జీఎస్టీ ఎగవేత

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ రూపంలో లబ్ధి పొందుతున్నారు. ఏవేవో ఆధార్ కార్డు వివరాలను దరఖాస్తులో నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల యజమానులకు తెలియకుండా వారి దుకాణాల్లో వ్యాపారసంస్థలు నిర్వహిస్తున్నట్లు ఆధారాలు సమర్పిస్తున్నారు. అనుమతులు జారీచేశాక వీటి కార్యకలాపాలపై వాణిజ్యపన్నుల శాఖ పర్యవేక్షణ ఉండట్లేదు. తనిఖీల సమయంలోనే కొన్ని అక్రమాలు బయటపడుతున్నాయి. సర్కిళ్ల పరిధిలో కాకుండా.. సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ ద్వారా అనుమతులు జారీకావడంతో ఎవరి పర్యవేక్షణా ఉండట్లేదు. సులభతర వాణిజ్య విధానంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ అయిపోతుంది. ఈ క్రమంలో దరఖాస్తుల్లోని వివరాల పరిశీలనకు వీలు ఉండట్లేదు. రిజిస్ట్రేషన్ జరిగాక... కొన్ని నెలల తర్వాత భారీగా ఇన్వాయిస్‌లు జారీ అయినట్లు గుర్తించాక గానీ అక్రమాలు జరిగినట్లు తెలియదు.

613 వ్యాపార సంస్థలను పరిశీలిస్తే 53 తూచ్

మలివిడత తనిఖీలలో రాష్ట్రంలో ఇటీవల వరకు 613 వ్యాపారసంస్థల లావాదేవీలు పరిశీలించగా.. 53 మనుగడలో లేవు. దాంతో 41 రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేశారు. 12 రిజిస్ట్రేషన్లను రద్దుచేశారు. సుమారు రూ.5కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లావాదేవీలు జరగకుండా బ్లాక్ చేశారు.

అమరావతిలో సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

వారిని గుర్తించి, నైపుణ్యం పెరిగేలా శిక్షణ ఇచ్చి ఆదరణ, ఇతర రాయితీ రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను ఎంపిక చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కావడానికి ముందు నుంచే బీసీ స్టడీ సర్కిళ్లలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తాం' అని తెలిపారు.

తెల్లారేసరికి.. తుడిచిపెట్టేసేలా!

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై చేష్టలుడిగి చూస్తోంది.

ఒక్క రోజులో 25 సెం.మీ. వాన

24 గంటల్లో 20 సెం.మీ వర్షం కురిస్తే.. అమ్మో కుంభవృష్టి అనేవాళ్లం. ఇప్పుడు ఒక్క రోజులో 25 సెం.మీ. వర్షం అనేది సాధారణంగా తయారైంది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో చాలాచోట్ల అతి, అత్యంత భారీ వర్షాలే నమోదవుతున్నాయి. గంట వ్యవధిలో 6 నుంచి 10 సెం.మీ. వర్షం కురుస్తున్న పరిస్థితులూ ఉన్నాయి. అది ఒకటి, రెండు ప్రాంతాలకే పరిమితమైతే వరద ప్రవాహం తక్కువే ఉంటుంది. కానీ వందల కిలోమీటర్ల విస్తృతిలో అత్యంత భారీగా వానలు కురుస్తుండటంతో వరదలు పోటెత్తి ఊరూ వాడా తేడా లేకుండా ముంచెత్తుతున్నాయి.

■ తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో.. సుమారు వంద కిలోమీటర్లకు పైగా విస్తృతిలో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. ఏకంగా 30 ప్రాంతాల్లో 25 సెం.మీ నుంచి 53 సెం.మీ వర్షం కురిసింది. అదే సమయంలో పొరుగునున్న ఎన్టీఆర్ జిల్లాలోనూ కుండపోత వానలు కురిశాయి. ఫలితంగానే మునేరు, బుడమేరుకు వరద పెరిగింది.

■ మిగ్‌జాం తుపాను సమయంలో గతేడాది డిసెంబరు 2 నుంచి 5వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు అంటే మూడు రోజుల్లో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలే కురిశాయి. పెళ్లకూరు, నాయుడుపేట, బుచ్చినాయుడుకండ్రిగ, చిల్లకూరు, నెల్లూరు అర్బన్, కోట తదితర 12 మండలాల్లో 50 సెం.మీ. పైగా వర్షం కురిసింది. ఏలూరు, అల్లూరి సీతారామ రాజు జిల్లాల్లోనూ అప్పట్లో 24 గంటల్లోనే 25 సెం.మీ పైగా కురిసింది. తుపాన్లు, ద్రోణుల ప్రభావంతో అత్యంత భారీవర్షాలు కురిసే ప్రాంతాలే ఎక్కువగా ఉంటున్నాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా బంధవీధి వద్ద పొలాల్లోకి కొట్టుకొచ్చిన రాళ్లకుప్పలు, చెట్లు

ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తేనే..

విరుచుకుపడుతున్న విపత్తులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. మన్యంలో అత్యంత భారీ వర్షాలతో ప్రజల జీవనమే ప్రశ్నార్థకంగా తయారవుతోంది. ఏ రాత్రి ఎటు నుంచి మట్టి, రాళ్లు, చెట్లతో కూడిన వరద ముంచెత్తుతుందో అనే భయాందోళనల మధ్య జనం బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కొండ ప్రాంతాల్లో ఎంత వర్షం కురుస్తుందో గుర్తించే పరిస్థితి లేదు. తెలుసుకునేలోగానే వరద ముంచేస్తోంది. పట్టణ, నగర ప్రాంతాల్లో కొండలపై ఇళ్లు కట్టుకున్న వారికీ వాన కురుస్తుందంటే గుండె దడే! రాష్ట్ర ప్రభుత్వం నదీ పరీవాహకాలతోపాటు.. మైదాన, కొండ ప్రాంతాల్లోనూ వర్షపాతాన్ని గుర్తించి తక్షణమే అప్రమత్తం చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. విపత్తు సమయాల్లో వారికి తక్షణ సహాయం అందించేలా చూడాలి.

మూడేళ్లలో రూ. 3,761 కోట్లు.. దేనికి ఖర్చయ్యాయో?

పెరుగుతున్న విపత్తుల నేపథ్యంలో ఆర్థిక సంఘం సూచనల మేరకు కేంద్రం రాష్ట్రాలకు ఎస్డీఆర్ఎఫ్ కింద నిధుల్ని కేటాయిస్తుంది. ఇందులో కేంద్రం 75%, రాష్ట్రం 25% భరిస్తాయి. 2021-22 నుంచి 2025-26 వరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.6,591 కోట్లు కేటాయించారు. 2021-22 నుంచి 2023-24 వరకు రూ.3,761 కోట్లు అందాయి. వివిధ రకాల విపత్తుల్ని ఎదుర్కొనేందుకు ఈ నిధుల్ని వినియోగించుకోవచ్చు. కానీ గత ప్రభుత్వంలో దేనికి ఖర్చు చేశారో లెక్కలూ చెప్పలేని పరిస్థితి.



అల్లూరి సీతారామరాజు జిల్లా చెల్లనిశిల్ప వద్ద నర్సీపట్నం- భద్రాచలం ప్రధాన రహదారిపై పెద్దఎత్తున విరిగిపడిన కొండచరియలు, పేరుకుపోయిన మట్టి

అమరావతి నుంచి పోర్టుకు జలమార్గం

ప్రతిపాదనపై సీఎం సానుకూలత: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నుంచి బందరు పోర్టుకు జలమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలో గురువారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అభివృద్ధి కింద అమరావతి నుంచి నేరుగా పోర్టు వరకూ కాలవ ద్వారా రవాణా సౌకర్యం కల్పించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న బందరు కాలవను అవసరం మేరకు అభివృద్ధి చేసి బందరు వద్ద అనుసంధాన కాలవను నిర్మిస్తే జలమార్గం సిద్ధం అవుతుందన్నారు. బుధవారం మచిలీపట్నం వచ్చిన చంద్రబాబు నగర అభివృద్ధితో పాటు, పోర్టు పనులు వేగవంతం చేసేందుకు ఆదేశాలు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్‌లో లేకపోయినా పోర్టు పనులను సందర్శించడం ద్వారా ముఖ్యమంత్రి మచిలీపట్నం నుంచే ఆకస్మిక తనిఖీలకు నాంది పలికారన్నారు. 300 ఎకరాలకు పైగా ఆస్తులున్న ఆంధ్రా జాతీయ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందన్నారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో ప్రముఖులైన ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యలు ప్రజా సహకారంతో కళాశాలను ఏర్పాటు చేస్తే ముంబయి నటి జత్వాని కాదంబరి కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అక్రమంగా కళాశాల ఆస్తులు అనుభవిస్తున్నారన్నారు. ప్రజలకు చెందాల్సిన ఆస్తి అన్యాక్రాంతం అవడంపై దీర్ఘకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నామని, తాజాగా చంద్రబాబు హామీతో త్వరలో ఇవి ప్రభుత్వపరం కానుందన్నారు. ఈ కళాశాలలో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రోల్డ్ గోల్డ్ పరిశ్రమకు సంబంధించి ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ద్వారా అభివృద్ధి చేయడంతో పాటు డిజైనింగ్‌లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చిరకాల వాంఛగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటుకు అడుగులు ముందుకు పడుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

వియత్నాంకు విమాన సర్వీసు నడపాలి

ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రం నుంచి వియత్నాంకు విమాన సర్వీసు నడపాలని వియట్‌జెట్ ఎయిర్ సీఈవోకు ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తరఫున లేఖ రాసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 'తృణధాన్యాలు, పప్పు దినుసులు, ఫుడ్ ప్రాసెసింగ్, రొయ్యల పెంపకం, సుగంధద్రవ్యాలు, పత్తి, ఆటో కాంపోనెంట్స్, బల్క్ ఫార్మా ఔషధాల ఉత్పత్తిలో రాష్ట్రానికి గుర్తింపు ఉంది. వాటిని దిగుమతి చేసుకొని విలువ జోడించిన తర్వాత ఇతర దేశాలకు వియత్నాం ఎగుమతి చేస్తుంది. రాష్ట్రం నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు వియత్నాంలో మెడిసిన్, అగ్రిఫార్మింగ్‌లలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. చౌక పర్యాటక ప్రదేశంగా వియత్నాంకు గుర్తింపు ఉంది. విశాఖ, విజయవాడల్లో ఏదో ఒక చోట నుంచి వారంలో రెండు విమాన సర్వీసులను నేరుగా వియత్నాంకు నడిపితే వెసులుబాటుగా ఉంటుంది' అని లేఖలో పేర్కొన్నారు.

ఆప్ సి-జోన్ సమన్వయకర్తగా నేతి మహేశ్వరరావు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆమ్ ఆద్మీ పార్టీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల (సి-జోన్) సమన్వయకర్తగా నేతి మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలవరం పనులపై సుదీర్ఘ సమీక్ష

● ప్రాజెక్టును సందర్శించిన సీఈఓ అతుల్ జైన్



ఎగువ కాఫర్ డ్యాం వద్ద ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీఈతో మాట్లాడుతున్న అతుల్‌జైన్

పోలవరం, న్యూస్‌టుడే: రెండ్రోజుల పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓ అతుల్ జైన్ ప్రాజెక్టు పనుల స్థితిగతులను గురువారం తెలుసుకున్నారు. స్పిల్‌వే, గైడ్ బండ్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, గ్యాప్-1, 2, 3లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకొని ప్రాజెక్టు కుడి వైపు జరిగిన అనుబంధ పనులు, జంట సొరంగాలు, రెగ్యులేటర్లు, బండ్-1, 2లను పరిశీలించారు. జలవనరులశాఖ అధికారులు, గుత్తేదారు, వాప్కోస్ ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పునరావాస కాలనీలను సీఈఓ సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట పోలవరం ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీఈ కె.నరసింహమూర్తి, పీపీఏ సీఈ రాజేశ్‌కుమార్, ఈఈలు పి.సుధాకరరావు, పి.వెంకటరమణ, పలువురు డీఈలు ఉన్నారు. సీఈఓ పర్యటనను పురస్కరించుకుని కవరేజ్ కోసం వెళ్లిన మీడియాను ప్రాజెక్టు ప్రాంతంలోకి అనుమతి లేదంటూ ఎస్పీఎఫ్ పోలీసులు స్థానిక చెక్‌పోస్టు వద్ద నిలిపేశారు.